నరకం - నరలోకం

సుజనశ్రీ

త్రీస్టార్ హోటల్లో కూర్చుని, తాపీగా సిగరెట్ పీలుస్తూ దూరంగా సముద్రంలో ఉవ్వెత్తున లేచి పడుతున్న తరంగాల వేపు చూస్తున్నాడు కిరణ్ కుమార్. అతడు గంభీర సముద్రంలా పైకి తాపీగా ఉన్నాడన్నమాటే గాని, అతడి మనసులో భీభత్సంగా తుఫాను వీస్తోంది.

అంతకు క్రితం ఒక గంట ముందు అతడు బాస్ ని కలుసుకుని విన్న విషయాలూ, అతడి స్వంత విషయాలూ కలగాపులగంగా చిక్కుముడి వేసుకుపోయి అతడి మనసులో పెద్ద సమస్యను తెచ్చిపెట్టినయ్.

మూడు రోజుల క్రితం పేపరు అతడి ప్రక్కనే పడి ఉంది. అందులో హెడ్ లైన్స్ వంక చూశాడు మరోసారి.

"ఇండియా మొదటిసారిగా మానవుడ్ని అంతరిక్షంలోకి పంపిన వైనం."

ఆ తర్వాత వాక్యాల్ని చదవలేకపోయాడు. అందులోని సారాంశమంతా తన బుర్రలో నాటుకుపోయింది ఎప్పుడో!

అణ్వస్త్ర పరీక్ష జరిపినందుకే కొన్ని దేశాలు ఇండియాను దుయ్యబట్టినయ్. అయినా భారతదేశం వాటిని లక్ష్యపెట్టకుండా, తనకు అవసరమైన విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ వచ్చింది. శ్రీహరికోటనుంచి రాకెట్లు ప్రేల్చడంతో మొదలైన అంతరిక్ష పరిశోధనా కార్యక్రమంలో ఆ సంఘటన సువర్ణాక్షరాలతో లిఖించబడాల్సిన రోజు.

మేజర్ వినయ్ సక్సేనా రాకెట్లో కూర్చుని అంతరిక్షంలోకి దూసుకుపోయాడు. భూమిచుట్టూ పరిభ్రమించి మూడురోజుల తర్వాత అతడు బంగాళాఖాతంలో దిగవలసి ఉన్నది. కాని అతడు నిర్ణీత కార్యక్రమం ప్రకారం బంగాళాఖాతంలోకి దిగలేదు. అతడు భూమికి సురక్షితంగా దిగివచ్చినట్టు రాడార్, టెలివిజన్ యంత్రాలు రూఢి చేశాయి.

కాని లెక్కల్లో ఎక్కడో తప్పు దొర్లివుండాలి, రాకెట్ ఎక్కడో నేలమీదికి దిగి ఉండాలని శాస్త్రజ్ఞులు అంచనా వేశారు.

అతడు బహుశా చైనా గడ్డమీద దిగవచ్చునని వారి ఊహ. ఆ ఊహే నిజమయితే తాము వ్యయప్రయాసలకు ఓర్చి, జరిపిన ఈ ప్రయోగం అంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది. చైనా ఇండియాల మధ్య సత్సంబంధాలు లేని కారణంగా, ఆ రాకెట్ని చైనావారు స్వాధీన పరచుకుంటారు. మేజర్ సక్సేనాను గూఢచారకలాపాల నెపంతో

అరెస్టు చేసి అతడినుంచి తమకు కావలసిన రహస్యాల్ని సేకరిస్తారు.

రెండు దేశాలమధ్యా రాయబార కార్యాలయాలు గూడ లేవు ఈ విషయమై సంప్రదింపులు జరపటానికి. అయినా భారత ప్రభుత్వం మెస్సేజ్ కి చైనావారు తమ భూభాగంలో ఎలాంటి రాకెట్ దిగలేదని సమాధానం పంపారు. భారత ప్రభుత్వం కలవరపడిపోయింది. ఏం చెయ్యటానికి పాలుపోలేదు. మేజర్ సక్సేనా, అతడి రాకెట్ ఇతర దేశస్థుల చేతిలో పడినందుకే బాధపడుతున్నారు.

రక్షణమంత్రి ఇంటలిజెన్స్ డిపార్ట్ మెంట్ ని సమావేశపరిచి కర్తవ్యం గురించి చర్చించాడు. చైనా భూభాగంలోకి ఇండియన్ ఏజెంట్స్ని పంపి సక్సేనను తిరిగి తెచ్చుకోవడమే గత్యంతరం. అయితే అది అంత సులభమయిన పనికాదు. కాని అంతకన్నా మరో మార్గంలేదు. పైగా చైనావారు తమ భూమిమీద దిగిన రాకెట్ కోసం అన్వేషణ చేసి వెదికి పట్టుకుంటారు. ఈ లోపలే భారత ఏజెంట్లు అక్కడకు చేరవలసి ఉంటుంది.

ఇంతవరకు రాకెట్ ఏ ప్రదేశంలో దిగిందో ఖచ్చితంగా అంచనా వేయలేకపోతున్నారు. రాకెట్ దిగే రోజు రాత్రి వాతావరణం బాగోలేదు. పెను తుఫాను వీస్తోంది బంగాళాదేశ్ వైపునుంచి. దాంతో రాడార్ లు 'జామ్' అయిపోయాయి. టెలివిజన్ కెమెరాల్లో ఏమీ కనబడకుండా పోయింది.

దేశంలో నలుమూలలా కేంద్రీకృతమై ఉన్న సీక్రెట్ ఏజెంట్స్ అందరూ పిలిపించబడ్డారు. ఏ వేళకు ఏవరితో అవసరం వస్తుందో అని అందర్నీ అప్రమత్తతతోనూ, ఏ క్షణంలో అయినా ఎటువంటి సాహసకార్యానికైనా

రెడీగా ఉండమని ఆదేశాలివ్వబడినై.

అటువంటి వారిలో కిరణ్ కుమార్ ఒకడు. మేజర్ సక్సేనా అదృశ్యం కావటం దేశ క్షేమదృష్ట్యా ప్రమాద కరమైనది. మరో విధంగా కూడా సక్సేనాతో కిరణ్ కుమార్‌కు సఖ్యత ఉంది.

మిలిటరీ హాస్పిటల్ నర్స్‌గా పనిచేస్తున్న అరుణను తను ప్రేమించాడు. ఆమె వివాహానికి సమ్మతిస్తే తను ఈ ఉద్యోగాన్ని వదిలిపెట్టి ఎక్కడన్నా శాశ్వతంగా స్థిర పడదామని అనుకున్నాడు. కాని ఆమె తన స్నేహానికి మాత్రమే తన ఇష్టతను చూపింది. ఆమే, సక్సేనా ఇద్దరూ ప్రేమించుకున్నారనీ, మిలిటరీలో తమ వ్యవధి పూర్తికాంగానే వివాహం చేసుకోవటానికి సిద్ధంగా ఉన్నారని తెలిసి కిరణ్ కుమార్ బాధపడ్డాడు.

"ఏ విధంగా చూసినా నేను సక్సేనాకు తీసిపోను ఎందులోనూ. పైగా అతడికన్న ఎక్కువ మెరిట్ గలవాడ్నే నేను. నన్ను కాదని అతనిలో ఏం చూసి నీవు అతడ్ని ప్రేమించావ్?" కిరణ్ కుమార్ సూటిగా ఆమెనే అడిగేశాడు.

అరుణ నవ్వింది. "నీలో అన్నీ మంచి గుణాలే ఉన్నాయ్. కాని నా భర్త రోజూ నా కళ్లెదుటే ఉండాలనీ, రిస్క్ లేని ఉద్యోగంలో సెటిల్ అవాలనీ నా కోరిక. కాని నీ ఉద్యోగ విధులు వీటికి విరుద్ధం" అంది.

అదీ నిజమే! తను ఏదన్నా సాధించుకురావటానికి వెళితే ఒక్కోసారి నెలల తరబడి హెడ్‌క్వార్టర్స్‌కు రాడు. అసలు తను తిరిగి రాగలడో, లేడో తనకే నమ్మకం లేదు. అందుకే అతడు అవివాహితుడుగానే ఉండిపోయాడు. కాని అరుణను చూసిన తర్వాత అతడి మనసులో మధురభావాలు కలగసాగినై. ఈ లోపల మేజర్

సక్సేనా అంతరిక్షయాత్రకు శిక్షణ నిచ్చేందుకు ఎన్నుకోబడ్డాడు. అరుణ వివాహం వాయిదా పడింది.

"అంతరిక్షంలోకి దూసుకుపోయి, తిరిగి రాగలడో లేడో నమ్మకంలేని వ్యక్తినా నీవు పెళ్ళాడేది?" అని కసిగా అడిగాడు ఆమెను.

"పోనీ నీ తర్వాత అసైన్ మెంట్ నుంచి నీవు సురక్షితంగా రాగలవేమో గుండెమీద చెయ్యివేసుకుని చెప్పు!" అన్నది అరుణ. ఎటువంటి ప్రశ్నకయినా చురుకుగా, వెనువెంటనే తెలివైన జవాబివ్వగల శక్తి ఉంది ఆమెకు. అందుకే ఆమె అంటే తనకు ఇష్టం.

ఇది జరిగిన ఏడాదికి మేజర్ సక్సేన్ అంతరిక్షంలోకి పంపబడ్డాడు. కాని అతడు అనుకున్న ప్రదేశానికి తిరిగి దిగలేకపోయాడు. పైగా ప్రమాదకర భూమిలో దిగాడు. అతడ్ని వెదికి వెనక్కు తీసుకురావలసిన భారం తమమీద మోపబడింది. అసలతడు బ్రతికి ఉన్నాడో లేదో. భూమికి ఢీకొని రాకెట్ బ్రద్దలయిపోయినా అయివుండవచ్చు.

అరుణను కలుసుకుందామని హెడ్ క్వార్టర్స్కి వెళ్ళిన కిరణ్ కుమార్ కి ఆశాభంగం అయింది మరోసారి.

"అరుణ తన ప్రియుడికి సాధ్యమైనంత దగ్గరగా ఉండాలని ఆమెగూడ హాంగ్ కాంగ్ వెళ్ళింది. చైనా గడ్డపై అడుగుపెట్టవలసిన మొట్టమొదటి ఏజెంట్ సుందర్ వెంటే వెళ్ళిందట. శత్రువులు అతడిని చంపి ఆమెను బంధించారట" చెప్పారు అక్కడి అధికారులు.

కిరణ్ కుమార్ వెంటనే హాంగ్ కాంగ్ కు ప్రయాణానికి బయలుదేరాడు.

2

మేజర్ వినయ్ సక్సేనా కళ్ళు తెరిచాడు. అతడి వంట్లో నీరసంగా ఉంది. కుడికాలు విరిగిపోయిందా అన్నంత

బాధగా ఉంది. మనిషి కదలలేకుండా ఉన్నాడు. అంతలోనే మెలకువ, ఆతర్వాత మళ్ళీ మగత, మెలకువ, మళ్ళీ మగత ఇలా అలలమధ్య ఊగాడుతున్నాడు అతడు.

అతడి ప్రక్కనే ఒక ముసలవ్వ, మరో ముసిలాయన నిలబడి నిస్సహాయంగా చూస్తున్నారు.

"పాపం! బ్రతుకుతాడో లేదో!" ముసిల్ది సానుభూతిగా అంది.

"అందరం పోయేవాళ్ళమే ఏదో ఒక నాటికి!" అతడు వేదాంతిలా జవాబిచ్చాడు.

సక్సేనా మూలిగాడు బాధగా.

"లీన్ షూ అన్నా త్వరగా మందులు తెస్తే బాగుండును."

సక్సేనా మనసు ఇంకా అంతరిక్షంలో పరిభ్రమిస్తున్నది. అనేక మందిని పరీక్షించి, వడబోసి మరీ తనను ఎన్నుకున్నారు అంతరిక్షయానానికి. అప్పుడు అతడు తన జన్మ సార్థకమైనట్టుగా సంతోషించాడు. తను ఇంకా రాకెట్ లో పరిభ్రమిస్తున్నట్టు కలలో తేలిపోసాగాడు. అంతలోనే మళ్ళీ బాధతో మూలిగేవాడు. కలకూ వాస్తవానికీ మధ్య అతడు ఊగులాడుతున్నాడు. తను నేలమీద పడటం బాగా గుర్తు. ఆ తర్వాత తను రాకెట్ కాప్సూల్ ని తెరుచుకుని నేలమీద పడిపోయాడు. ఎవరో తనని మోసుకుపోయినట్టు లీలగా గుర్తు.

బలాన్నంతా కూడగట్టుకుని కళ్ళు తెరిచాడు. తన ముఖంలోకి చూస్తూ ముసలావిడ అడిగింది.

"నా మాటలు వినబడుతున్నాయా?"

"ఆఁ! వినబడుతున్నాయ్!... అమ్మా!" అన్నాడు బాధగా.

"కొంచెం ఓర్చుకో. నీకు మందులు తేవటానికి 'లీన్ షూ'ని పంపాం. నిదానంగా వస్తుంది. డాక్టరికి కబురు

చేశామంటే ప్రమాదం. పోలీసులు వచ్చి పడతారు."

"డాక్టరు వద్దులే! నా విషయం ఎవరికన్నా చెప్పారా?"

"లేదు. ఎవరికీ చెప్పలేదు."

"ఇది ఏ దేశం?"

"చైనా దేశం!"

సక్సేనా కళ్ళు మూసుకున్నాడు నీరసంతో, బాధగా.

"నీవు రష్యాదేశానికి చెందిన వాడివేమో పోలీసులకు తెలియజేద్దాం అనుకున్నాం. కాని రాకెట్‌ని చూడంగానే నీవు భారతీయుడివని గుర్తించాం. నీవు ఇక్కడ్నుంచి సురక్షితంగా ఎలా బయటకు చేరగలవా అనే ఆలోచిస్తున్నాం. నా కుమారుడు వాంగ్-ఛూ ఢిల్లీకి వెళ్ళాడు. నీ విషయం మీ వాళ్ళకు అందజేయటానికి ప్రయత్నిస్తాడు. ఆపైన అదృష్టం ఎలా ఉంటే అలా జరుగుతుంది."

"సరే!" అని తల ఊపి మళ్ళీ మగతలో పడిపోయాడు సక్సేనా.

ఆకాశ వీధిలో నక్షత్రాలు వేగంగా జరిగిపోతున్నాయ్. భూమి నారింజపండులాగ కనబడుతోంది. తన పరిభ్రమణంలో ప్రపంచంలోని దేశాలన్నిటినీ చూడగలుగుతున్నాడు. రాకెట్‌లో తన గదిలో టేప్ రికార్డులు తిరుగుతున్నయ్. వాతావరణాన్ని రికార్డుచేసే మీటర్లు, అంతరిక్షంలోని ధూళిలో ఉన్న రసాయనిక పదార్థాలను కొలిచే యంత్రాలూ అన్నీ పనిచేస్తున్నయ్.

అంతలోనే రాకెట్ చివర మరో చిన్నసైజు రాకెట్ పేలింది. రాకెట్ భూమివైపుగా మళ్ళీ శూన్యంలోంచి వాతావరణంలోకి దూసుకుపోతోంది. షెడ్యూలు ప్రకారం

తను ముప్ఫయి రెండుసార్లు భూమిచుట్టూ పరిభ్రమించాల్సి ఉండగా, ఇరవయ్ ఎనిమిది పరిభ్రమణాల అనంతరం భూమికి దిగుతోంది. ఎక్కడో ఏదో పొరబాటు జరిగి ఉండాలి.

అతడు భయంతో తనముందున్న మీటర్ని నొక్కాడు. బలంగా లాగాడు. ఏంచేసినా రాకెట్ వేగం తగ్గలేదు. ప్రయాణం మళ్ళలేదు. సంవత్సరకాలం ఇచ్చిన శిక్షణని మరిచి అతడు మరణానికి భయపడుతూన్న మామూలు సామాన్య మానవుడు అయిపోయాడు.

షెడ్యూల్ ప్రకారం తను బంగాళాఖాతంలో దిగాల్సి ఉంది. భారత నౌకలు, హెలికాప్టర్లూ తనకోసం కాచుకూర్చుని ఉంటయ్.

కాని తను నీళ్ళమీద కాకుండా నేలమీదకు దిగుతున్నాడు. రాకెట్కున్న పారాచూట్లు తెరుచుకుని రాకెట్ నేలకు ఢీకొని వ్రుండిపోకుండా కాపాడినయ్.

తను కూర్చున్న గది రాకెట్నుంచి విడిపోయింది. పారాచూట్లు తెరుచుకుని నిదానంగా నేలకు దిగుతుండగా రాకెట్ మిగతా భాగం గాలిలో నుసి అయిపోయింది.

తను ఎక్కడ దిగుతోంది తనకే తెలియలేదు. కొండలూ, అడవుల మధ్యలో, కుండపోతగా కురుస్తున్న వర్షంలో దిగాడు తను. చెట్ల కొమ్మలను విరిచేస్తూ, స్వర్గంనుంచి విసిరివేయబడ్డ రాయిలా క్యాప్సూల్ నేలమీద ఆనింది.

దూరాన కనబడే చిన్నచిన్న దీపాల కాంతివల్ల అది రాత్రి అని తెలుసుకున్నాడు. ఆ తర్వాత అతడికి తెలివి తప్పిపోయింది.

కళ్ళు తెరిచిన తర్వాత అతడికి రాతితో కట్టబడిన పాత ఇల్లు కనుపించింది. తను ఇంకా బ్రతికి ఉన్నందుకు

తన అదృష్టాన్ని మెచ్చుకున్నాడు. అయితే ఒక కాలికి మాత్రం బలంగా దెబ్బ తగిలింది. బహుశా ఫ్రాక్చర్ గూడ అయిందేమో. బాధ భరించలేనంతగా ఉంది.

"ఇంకా మందులు రాలేదా?" కళ్ళు తెరిచి ముసిలాడ్ని అడిగాడు.

"రాలేదు నాయనా?"

"మీరు హిందీ బాగానే మాట్లాడుతున్నారే!" సక్సేనా అడిగాడు.

"అవును. భారత చైనాల మధ్య యుద్ధం రాకముందు నేను ఉత్తర ప్రదేశ్‌లో పండ్ల డాక్టర్, అంటే డెంటిస్ట్‌గా ఉండేవాణ్ణి. భారతీయ భాషలు ఇంకా తెలుగు, అరవం, హిందీ, బెంగాలీ వచ్చునాకు. యుద్ధం మూలంగా మమ్మల్ని చైనాకు తిరిగి అప్పజెప్పారు. అప్పట్నుంచి మాకు కష్టాలు ప్రారంభమయినయ్. శరణార్థులుగా మమ్మల్ని ఆదుకోవలసిన ప్రభుత్వం, మమ్మల్ని సమాజంలోంచి వెలివేసింది. కారణం! మేము భారతదేశంలోఉండి వచ్చామనిట!

"ఈ అడవిలో కట్టెలు, కలపకొట్టి దాన్ని ఇతర గ్రామాల్లో అమ్మి దానితో మేము జీవించాలి. ఈ వృద్ధాప్యంలో గూడ కష్టపడక తప్పలేదు" ముసలాడు దీనంగా తమ కథను చెప్పాడు.

"నీకు పిల్లలు లేరా?" సక్సేనా అడిగాడు.

"ఉన్నారు. ఇద్దరు కొడుకులూ, ఒక కూతురూ! పెద్ద కొడుకు దేశంలో మార్పు తెస్తున్న 'కల్చరల్ రివల్యూషన్'ని విమర్శించాడు. వాడ్ని చెట్టుకు కట్టేసి మా కళ్లెదుటే కాల్చి చంపారు. రెండో కొడుకు ఓడలో పైలెట్‌గా పనిచేస్తున్నాడు. మా అమ్మాయి ఆ కనబడే ఊళ్ళో హెల్త్ విజిటర్‌గా పనిచేస్తున్నది."

"వాంగ్-ఛూ నా సమాచారాన్ని గోప్యంగా మా

దేశానికి అందజేయగలడా? అక్కడ్నుంచి సహాయం వచ్చేలోపల తన గదిలోని టేప్‌లనూ, ఇతర సాంకేతిక పరికరాల్ని జాగ్రత్తగా కాపాడాలి. నా ప్రాణాలకన్నా అవి ముఖ్యం."

"అవన్నీ మా అమ్మాయి చూసుకుంటుందిలే. నీ రాకెట్‌కి కట్టివున్న పారాచూట్‌లు అన్నీ చుట్టచుట్టి భూమిలో పాతేసింది అదే!"

అతడు నిద్రలోకి జారుకున్నాడు.

ఎవరో అతడ్ని తట్టిలేపారు. "మందులు తెచ్చాను. అవి వేసుకోండి!" అతడి కళ్ళలోకి చూస్తూ పంధొమ్మిదేళ్ళ అమ్మాయి అంది.

ఈమే లిన్‌షూ అయివుండాలనుకున్నాడు సక్సేనా. ఆమె మోకాళ్ళవరకూ వేలాడే పొడవాటి గౌన్ తొడుక్కుంది. బాబ్డ్ హెయిర్. ఆమెలో భారతీయత దాగివుంది అనుకున్నాడు సక్సేనా.

"పెన్సిలిన్ టాబ్స్ తెచ్చాను వేసుకోండి! యాంటిబయాటిక్స్ గూడ తెచ్చాను. మీ కాలికి చీము పొయ్యకుండా ఆపుతయ్, సరైన వైద్యసదుపాయందొరికేదాకా!"

"థాంక్యూ మాడమ్!" అతడి నోట్లో టాబ్లెట్ వేసి లోటాతో నీళ్ళు పోసింది.

"ఆ మందులు ఎక్కడ తెచ్చావ్?" ఆమె తండ్రి అడిగాడు.

"ఎక్కడ తెస్తేనేం! తెచ్చాను గదా!" ఆమె విసుగ్గా అంది.

"ఎవరికీ తెలియకుండా తెచ్చావు గదా అని అడిగానమ్మా! ఘుంగ్‌లీ ఇప్పించాడు కదూ వాటిని?"

"ఆ పోలీసువాడు అనుమానిస్తాడేమో!"

"అంతకన్నా మనకు ఎవరూ మందులివ్వరు. వాడికి అను

మానం కలక్కుండా ఉండటానికి నేను త్వరగా వెళ్ళాను. వాడు ఇక్కడకు రాకుండా జాగ్రత్తపడాలి? ఎలావుంది ఇప్పుడు?" సక్సేనా వంక చూస్తూ అడిగింది.

"కొంచెం నయం! కాని మిమ్మల్ని ప్రమాదంలో ముంచటానికే నేను బ్రతికి ఉన్నట్టున్నాను."

"ఇక్కడ ఇరవయినాలుగ్గంటలూ ప్రమాదమే! ఏవేళప్పుడు ఎవడికి మూడుతుందో తెలియదు."

"నామీద కోపంగా ఉందా?"

"అబ్బే! కోపం ఎందుకు!" ఆమె వెటకారంగా అంది. "ఈ ముసలి దంపతులు నా తల్లిదండ్రులు. నేను ఈ గ్రామంలోని హెల్త్ సెంటర్‌లో నర్సుని. ఇక మా అన్నయ్య నీ ఉనికిని మీ వాళ్ళకు తెలియజేయటానికి వెళ్ళాడు. అంటే మేమందరం కత్తిమీద సాము చేస్తున్నాం."

"ఇందాక పోలీసు దగ్గర మందులు తెచ్చానన్నావేమిటి?"

"అవును! ఇక్కడ ముఖ్యమయిన మందులు అడిగితే వారినిగూడ పోలీసులు అనుమానిస్తారు. ఇది కియాంగ్నా అనే చిన్న పల్లె. సముద్రానికి అరవయ్ మైళ్ళ దూరంలో ఉంది. ఘుంగ్‌లీ అనేవాడు ఇక్కడ ఇన్‌స్పెక్టర్. వాడు నామీద కన్నేశాడు. చాలాకాలంనుంచి నన్ను పట్టాలని పగబట్టాడు. అవును! నీవు ఎవరో స్త్రీ పేరు కలవరించావు! ఎవరామె? నీ భార్యా?"

"కాదు! నా కాబోయే భార్య ఆమె!"

"అలాగా! సరే! ఇక పడుకోండి. మీపై కోపగించుకుంటున్నందుకు నాకూ విచారంగానే ఉంది. కాని నీ రాకవల్ల ఈ కుటుంబం ఇంకా పతనమైపోతుంది. ఇప్పటికే మమ్మల్ని సంఘంలోంచి వెలివేసి ఊరికి దూరంగా అడవిలో

ఉంచారు. నీకు ఆశ్రయం ఇచ్చిన సంగతి పోలీసులకు తెలిస్తే మమ్మల్ని దేశద్రోహుల క్రింద జమకట్టి చుట్టూ ఉన్న చెట్లకు మమ్మల్ని ఉరితీస్తారు. ఇక పడుకోండి వస్తాను" అంటూ ఆమె వెళ్ళిపోయింది, దుప్పటి గొంతు వరకూ కప్పి.

అయితే తను అరుణ పేరు కలవరించాడా? కిరణ్ కుమార్ ఆమెను తనకు పరిచయం చేశాడు. ఆ తర్వాత తామిద్దరి స్నేహం బాగా పెంపొంది వివాహందాకా వచ్చింది. ఆలోచిస్తూనే అతడు నిద్రలోకి జారుకున్నాడు.

3

తన రూమ్ హ్యాండిల్ మీద చెయ్యి వేయబోయి ఆగాడు కిరణ్ కుమార్.

తను లేనప్పుడు దొంగతనంగా ఎవరైనా విదేశీ ఏజెంట్లు జొరబడవచ్చేమో అని ఊహించి, హ్యాండిల్ మీద పల్చటి పౌడర్ చల్లాడు బయటకు వెళ్ళేటప్పుడు. హ్యాండిల్ మీద వ్రేలిముద్రలు ఎవరివో స్పష్టంగా కనుపిస్తున్నయ్.

జేబులోని పిస్టల్ ని గట్టిగా పట్టుకుని రెండో చేత్తో హ్యాండిల్ త్రిప్పి లోపలకు వెళ్ళాడు. తలుపు పక్కనే ఒక పుస్తకాన్ని దోవకడ్డంగా పడేసి వెళ్ళాడు తను. ఆగంతకుడు లోపలకు పోవాలంటే, దాన్ని తొక్కిగాని లోపలకు పోవాలి లేదా ప్రక్కకు తన్నాలి. పుస్తకం ప్రక్కకు తన్ని వేయబడివుంది.

తలుపు తన వెనుకనే మూసేసి లాక్ చేశాడు. అక్కడే నిలబడి రూమ్ అంతా కలయజూశాడు. బెడ్ క్రిందా, కిటికీ కర్టెన్ల చాటునా ఎవరూ లేరు. అతడి దృష్టి బాత్ రూమ్ వేపు మళ్ళింది.

అడుగులో అడుగు వేసుకుంటూ బాత్ రూమ్ దగ్గరకు

వెళ్ళి దభాలున తలుపు తోశాడు. పిస్టల్ గురిపెట్టి చూస్తూ "ఎవరు లోపల. వెంటనే బయటకు రావాలి. లేదా లోపలకు చేతిబాంబు విసురుతున్నాను" అన్నాడు.

లోపల్నుంచి సమాధానం రాలేదు.

"ఎవరూ లేరా లోపల? బాంబ్ విసురుతున్నాను" అంటూ బూట్ కాలుతో నేలమీది వస్తువును లోపల పడేలా తన్నాడు.

"ఆగండి! నన్ను చంపద్దు!" అంటూ లోపల్నుంచి ఎయిర్ పోర్టులో తనను వెంటాడిన స్త్రీ బయటకుదూకింది.

"చేతులు పైకెత్తు!" అని ఆజ్ఞాపించాడు కిరణ్ కుమార్. ఆమె జేబుల్ని వెతికాడు. రివాల్వర్ దొరికింది. మరో జేబులో సిగరెట్ ప్యాక్ దొరికింది. వాటిని టేబుల్ మీద పడేశాడు. ఆ తర్వాత ఆమె రొమ్ముల మధ్యగా చెయ్యిపెట్టి వెదికాడు.

ఆమె నక్కిలిగిలిగా కదిలింది. "అక్కడ ఏం లేవు!" అంది.

"ఎవరు నీవు? ఎందుకు వచ్చావ్?" గద్దించి అడిగాడు.

"ఆ బోడిగుండు వెధవ నీ దగ్గర కాగితాలు వెదకమని పంపాడు.

"ఎవడు వాడు?"

"వాడెవరో నాకూ తెలియదు. అతడి పేరు ప్యావో అని మాత్రమే తెలుసు. అంతకన్న అతడ్ని గురించిన వివరాలు నాకు తెలీవు!"

"అయితే నువ్వు ఆడ ఏజంటువా? ఏదేశం తరఫున పనిచేస్తున్నావ్?"

"అదంతా నాకూ తెలియదు. 'ప్యావో' చెప్పినవిధంగా చేయడమే నా పని. ఎందుకు, ఏమిటి, ఎవరికోసం అని అడిగే అధికారం నాకు లేదు."

కిరణ్ కుమార్ ఛెడేలున ఆమె దవడమీద కొట్టాడు. ఆమె కళ్ళంట నీరు జలజల కారింది. "చెప్పు! ఊఁ!" అన్నాడు.

"నన్ను నమ్మండి. 'ప్యావో' అంటే నాకు ద్వేషం. కాని అతడు చెప్పినట్టుగా చేయక తప్పలేదు. నాతమ్ముడు షాంగ్ అతడి చేతుల్లో ఉన్నాడు. అందుకే నేను అతడు చెప్పినట్టల్లా చేయాల్సివస్తోంది. లేకపోతే అతడ్ని చిత్రహింసపెట్టి నామీద పగను అతడిమీద తీర్చుకుంటాడు!"

"నీ తమ్ముడా? ఎక్కడున్నాడు అతడు?"

"తైపేలో ఏదో స్కూల్లో ఉన్నాడని చెప్పాడు. అతడి క్షేమం గురించే నేను ఆ వెధవ చెప్పినట్టల్లా చేయాల్సి వస్తున్నది."

"అయితే నిన్ను బ్లాక్ మెయిల్ చేసి, వాళ్ళు నీచేత ఈ పనులు చేయిస్తున్నారా?"

"అవును. వాడు చాలా దుర్మార్గుడు. వాడు అరుణను నీకోసమే కిడ్నాప్ చేశాడు. ఆమెను వెతుక్కుంటూ నీవు వస్తావని అన్నాడు."

"నన్ను పట్టుకోవడంకోసం వాడు అరుణని ఎత్తుకెళ్ళాడా? వాడ్ని ప్రాణాలతో వదలకూడదు. 'ప్యావో' గురించి చెప్పు ఇంకా!"

"అతడ్ని గురించి నాకంతగా తెలీదు. కాని నీ గురించిన సమాచారం అంతా అతడికి తెలుసునని చెప్పాడు. నీవూ, అరుణ లోగడ ప్రేమించుకున్నారట గదా! ఆమె కోసం నీవు నిప్పుల్లోగూడ దూకుతావట. నిన్నూ, నీతో బాటు ఆ పేరేమిటబ్బా, ఆఁ! సక్సేనా అట! మీ ఇద్దర్నీ ప్రాణాలతో పట్టిస్తే చైనా ప్రభుత్వం అతగాడికి ప్రమోషన్ ఇస్తుందట. పెద్ద బహుమతిగూడ ఇస్తుందన్నాడు."

"అందుకని, ఈ పనికి నిన్ను ఉపయోగించుకుంటు

న్నాడా?"

"అంతేకాదు. తనపని పూర్తికాగానే నా తమ్ముణ్ని అప్పజెబుతానన్నాడు గూడా!"

కిరణ్ కుమార్ ఆమె కళ్ళల్లోకి చూశాడు. ఆమె ముఖంలో అమాయకత్వం తొణికిసలాడింది. ఆమె చెప్పే విషయాలు నమ్మదగినవిగానే కనుపించాయి.

"ప్యావో వాడి అసలు పేరేనా? లేక మారుపేరా?"

"నాకు తెలియదు. రెడ్ గార్డ్స్ ఉద్యమానికి ముందు నేను చైనాలో టీచర్ గా పనిచేస్తుండేదాన్ని. అప్పుడు నా తమ్ముడు చిన్నపిల్లవాడు. సైనిక సంచలనంలో నా తండ్రి దేశద్రోహ నేరంక్రింద చంపబడ్డాడు. నేను నా తమ్ముడ్ని తీసుకుని పారిపోయాను. హాంగ్ కాంగ్ చేరుకుని అక్కడ్నుంచి మరో దేశం పారిపోదామనుకున్నాను. కాని చైనాతీరం దాటకుండానే పట్టుబడిపోయాం. నన్ను కొన్నాళ్ళు జైల్లో ఉంచారు. ఆ తర్వాత నేను హాంగ్ కాంగ్ పోవటానికి అనుమతించబడింది, వాళ్ళకు గూఢ చారిగా పనిచేయటానికి. నేను వాళ్ళ చేతుల్లోంచి పారి పోకుండా ఉండగలందులకు నా తమ్ముడ్ని తమ చేతుల్లోనే అట్టే పెట్టుకున్నారు."

"నీ పేరేమిటన్నావ్!"

"ఇక్కడి పేరు మేరీ! ప్రస్తుతం ఆ పేరుతోనే పిల వండి!"

"ప్యావోని మళ్ళీ ఎప్పుడు కలవాలి నీవు!"

"ఈరోజు సాయంత్రం కలుసుకుని నీ ప్లాన్ గురించి కబురు చెప్పాలి!"

"గుడ్! తర్వాత మరో ముఖ్యవిషయం! నీ తమ్ముడ్ని విడిపించి నిన్నూ అతడ్నీ స్వేచ్ఛా ప్రపంచంలోకి వది లేస్తాం! నావెంట వస్తావా?" కిరణ్ కుమార్ అడిగాడు.

"ఎందుకు?" మేరీ అనుమానాస్పదంగా అడిగింది.

"ప్యావోని పట్టుకోవాలి! అరుణను విడిపించుకోవాలి. అందుకు నీ అవసరం ఉంది!"

మేరీ ఆశ్చర్యపోయింది. "చూస్తూ చూస్తూ పులిబోను లోకి నడుస్తావా?"

"అలాంటి పులుల్ని ఎన్నిటినో లొంగదీసుకున్నాం! వీడో లెక్కా? ఏమంటావ్?"

ఆమె తటపటాయించింది.

కిరణ్ కుమార్ తన కిట్ లోంచి సిరంజ్ తీసి అందులోకి మందు ఎక్కించాడు.

కంగారుపడుతున్న మేరీ చేయిపుచ్చుకుని కసుక్కున సిరెంజ్ తో ఇంజెక్షన్ ఇచ్చాడు.

"ఏమిటిది? ఎందుకు?" అన్నది కంగారుగా మేరీ.

"భయపడకు. కొంచెం మైకం కమ్ముతుంది అంతే. నిన్ను నాతోపాటు తీసుకువెడుతున్నాను. ప్యావో అరుణను నాకు అప్పగించేదాకా నీవు నా బందీవి" అన్నాడు నవ్వుతో.

"అయ్యో! నా కెవరు దిక్కు? సాయంత్రానికి ప్యావోని కలవకపోతే నా తమ్ముడ్ని చంపేస్తారు!"

"ప్యావో అంత తెలివితక్కువ వాడని అనుకోను! అయినా నీ తమ్ముడి ప్రాణం కాపాడే భారం నాది."

మేరీ ఏదో మాట్లాడబోయింది. కాని ఆమెను మత్తు ఆవహించింది.

కిరణ్ కుమార్ ఆమెకు మేకప్ చేయసాగాడు. మరో అరగంటలో ఆమె మగవాడి దుస్తుల్లోవుంది.

4

ఎండ తీవ్రంగా కాస్తోంది. కప్పులోని రంధ్రంగుండా ఎండ పొడ అతనిమీద పడింది. కళ్ళు నులుముకుంటూ

లేచాడు వినయ్‌సక్సేనా. అతడి శరీరంలో బాధ తగ్గింది. లీన్‌షూ ఇచ్చిన మందులు బాగానే పనిచేశాయన్నమాట అనుకున్నాడు.

"ఇప్పుడు కులాసాగా ఉందనుకుంటాను?" లీన్‌షూ అడిగింది.

"అవును! చాలా కృతజ్ఞుడిని!"

"నన్ను అభినందించకండి! మా అమ్మా నాన్న కోరిక మీద మీకు ఆశ్రయం ఇవ్వాల్సి వచ్చింది. నేనైతే పోలీసులకు వెంటనే అప్పజెప్పేదాన్ని. మా కుటుంబం ఇప్పటికే చితికిపోయింది. సంఘద్రోహులుగా మేం వెలివేయబడ్డాం. మీకు ఆశ్రయం ఇచ్చిన నేరానికి దేశద్రోహులుగా ఎంచబడతాం" బాధగా చూసింది లీన్‌షూ.

"మీ నాన్న ఎక్కడ?" టాపిక్ మారుస్తూ అడిగాడు సక్సేనా.

"అడవిలో కలప కోస్తున్నాడు. ఈ వృద్ధాప్యంలో గూడ అతడికి కష్టాలు తప్పలేదు!"

"నాకు తినటానికి ఏమైనా ఉందా?"

ఆమె లేచింది. రొట్టె, సూప్ తెచ్చి అతనిముందు పెట్టింది. గత రెండురోజులుగా ఆహారం లేదేమో వాటిని ఆవురావురుమంటూ తినేశాడు.

ఖాళీ ప్లేటునీ, గిన్నెనీ లీన్‌షూ తీసుకుని వెళ్ళింది లోపలకు. వినయ్‌సక్సేనా తన పాకెట్ జేబులోకి చెయ్యిపెట్టి విటమిన్ టాబ్లెట్స్ బయటకు లాగాడు. ఒక టాబ్లెట్‌ని నోట్లో వేసుకుని గ్లాసులో నీళ్ళు గొంతులో పోసుకున్నాడు. ఒక గంటలో అతడికి సత్తువ వచ్చింది. లేచి తిరగాలన్న కోరిక కలిగింది.

లేచి నిలబడ్డాడు సక్సేనా. అతడు కాలు సరిగా మోపలేకపోయాడు. గోడపట్టుకుని నడిచాడు కొంతదూరం.

తిరిగి అలానే బెడ్ దగ్గరకు వచ్చి చేరాడు. ఇలా తను ఇక్కడ అసహాయుడుగా ఎన్నాళ్ళుండాలో! ఇండియా నుంచి తనకు సహాయం వస్తుందా? ఈ లోపల చైనీయులు తనను వెదకి పట్టుకోరుగదా? ఇవే అతడ్ని వేధిస్తున్నయ్.

బయట ఎవరివో మాటలు వినిపించినయ్. అవి ముస లాడి మాటలని గుర్తుపట్టాడు. అతడు చైనా భాషలో మాట్లాడుతున్నా అతడి కంఠంలో ఆతృతను తేలికగా పసిగట్టాడు సక్సేనా. వారంత ఆదుర్దా పడాల్సిన విషయం ఏమైవుంటుంది? తన విషయాన్ని పోలీసులు కనిపెట్టే శారా? అతడి హృదయం దడదడ కొట్టుకుంది.

ముసలాడూ, అతడి భార్యా లోపలకు వచ్చారు.

"నువు చెప్పేది నిజమేనంటావా?" లీన్‌షూ నమ్మలే నట్టుగా అడిగింది.

"నిజంగానే తల్లీ! ఘుంగ్‌లీ సైకిల్ మీద వస్తూండడం మేమిద్దరం కళ్ళారా చూశాం. అతడు మనింటికే బయలు దేరి ఉంటాడు. ఇప్పుడెలా?"

"పోనీ అతడ్ని అప్పజెప్పితేనో?" లీన్‌షూ అన్నది.

"ఒకవంక వాంగ్ ఛూని పంపాంకదా? అతడు వచ్చే దాకానన్నా ఇతడ్ని కాపాడ్డం మన ధర్మం. ఆ తర్వాత ఆ అబ్బాయి అదృష్టం."

"ఆ అబ్బాయి అదృష్టం అలా ఉంచు. ముందు మన గతి చూడండి. ఇన్‌స్పెక్టర్ అతడ్ని కనుక్కున్నాడంటే మనం ఏమయిపోతాం? అతడొక్కడి ప్రాణాలకోసం ఇందరి ప్రాణాల్ని బలిచేయాలా?"

"అలా అనకే తల్లీ! భారతదేశంలో మనం రాజుల్లా బ్రతికాం. ఇంకా ఆ శక్తి మా రక్తంలో ప్రవహిస్తూనే వున్నది. అప్పటికి నీవు చిన్నపిల్లవు. ఇక్కడకు వచ్చి మన దేశంలోనే మనం హీనంగా చూడబడుతున్నాం" ముసి

లాడు అన్నాడు ఆవేశంతో.

"మనం వాదించుకుంటూ కాలం గడిపితే ప్రయోజనం లేదు" అంటూ ముసిలావిడ విలువైన క్షణాల గురించి గుర్తు చేసింది.

ముగ్గురూ వాకిలి తలుపు మూసేశారు. సక్సేనాను తీసుకువెళ్ళి పశువుల కొట్టంలో పడుకోబెట్టారు.

సరిగ్గా అదే సమయానికి తలుపు తట్టాడు ఇన్‌స్పెక్టర్ ఛుంగ్ లీ. ఆదరాబాదరాగా సక్సేనామీద గడ్డికప్పింది లీన్‌షూ. ముసిలాడు వెళ్ళి తలుపు తీశాడు. ముసలిది వెళ్ళి సక్సేనా బెడ్ మీద పడుకుంది.

"లీన్‌షూ! ఎక్కడున్నావ్?" కర్కశమైన గొంతు వినిపించింది. వెంటనే పశువులకొట్టం వాకిలి దగ్గరే ఎదురు పడ్డాడు ఛుంగ్ .

"మీ రిచ్చిన మందులు మా అమ్మకు బాగా పనిచేసినయ్! నండి! అలా వెళ్ళి మాట్లాడుకుందాం!" అంది లీన్‌షూ ముఖంమీద నవ్వు పులుముకుంటూ.

"వద్దు! ఇక్కడే మనకు ఏకాంతంగా ఉంటుంది" అంటూ ఆమెకు అడ్డువచ్చాడు ఇన్స్పెక్టర్.

అతడు ఆరడుగుల వ్యక్తి. ఆకుపచ్చని యూనిఫారమ్‌లో ఉన్నాడు. పాలిష్ చేసిన బూట్లు, నడుము బెల్టులో రివాల్వర్, కోరమీసాలు, ముఖంలో కొట్టవస్తూన్న క్రూరత్వం వీటన్నిటినీ సక్సేనా గడ్డిలోంచి గమనిస్తూనే ఉన్నాడు.

అతడు తన వెనుకగా తలుపు మూసేశాడు. "నిన్న రాత్రి కలుస్తానంటివిగదా?" అని అడిగాడు ఆమె నున్నటి చెక్కిలిపై వ్రేలితో రాస్తూ.

"ఎవరో పేషెంట్స్ వచ్చారు. అందుకే రాలేక పోయాను."

"అలాగా! మీ అమ్మ ఆరోగ్యం తెలుసుకున్నట్టూ ఉంటుంది. నీతో మాట్లాడినట్టూ ఉంటుందని నేనే వచ్చాను. ఇక్కడ మీకే ఇబ్బంది లేదనుకుంటాను. మిమ్మల్ని రెడ్ గార్డ్స్ బాధించకుండా కాపాడాను. ప్రశాంతంగా ఇక్కడ నివసించే ఏర్పాటుచేశాను. నాకు చేతనైన సహాయం చేశానా లేదా?"

"అవును! మాకు చాలా సాయంచేశారు" అని ఎటో చూస్తున్న ఆమె నడుంచుట్టూ చేతులువేసి తన కౌగిలిలో బంధించేశాడు.

ఆ కాముకుడి కళ్ళల్లో అనంతమైన తృష్ణను చూశాడు సక్సేనా. కాని అతడు నిస్సహాయుడు. ఈ సీను ఎప్పుడు అయిపోతుందా అని బిగబట్టుకుని పడుకున్నాడు.

ఘుంగ్ సీ ఆమె పెదవులపై గట్టిగా ముద్దుపెట్టుకున్నప్పుడు ఆమె గింజుకోలేదు ఎప్పటిలా. ఆమె గౌను క్రిందుగా చేయిపోనిచ్చి అండర్ వేర్ జిప్ లాగేశాడు అతడు. డ్రాయర్ క్రిందకు జారింది. ఆమె నిస్సహాయంగా, జాలిగా అతడి కళ్ళల్లోకి చూసింది.

"ఇక్కడా? వద్దు ఇన్ స్పెక్టర్?" అంది ఆకులా వణికి పోతూ.

అతడు నవ్వాడు పైశాచికంగా. "ఇదే అసలైన చోటు!" అంటూ ఆమె వక్షోజాల దగ్గర గౌన్ హుక్స్ విప్పాడు. పాలపిట్టల్లాంటి పాలిండ్లు యవ్వనంతో, ఆవేశ భయాలకు ఎగిరెగిరి పడుతున్నాయ్. ఇద్దరూ ఒకరివంక మరొకరు చూసుకున్నారు. తీరని కామదాహంతో క్రోధంగా కుమ్మబోయే ఆబోతులా ఒకరు చూస్తే, నిస్సహాయంగా, చేసేదిలేక దీనంగా చూస్తోంది ఆమె. ఆమెను నేలమీదకు ఒరగేలా చేశాడు. ఆ తర్వాత ఆమెమీదకు వాలిపోయి ఆమెను పూర్తిగా ఆక్రమించుకున్నాడు.

అతడి ఉచ్ఛ్వాస నిశ్వాసాలూ, అంతవరకూ ఏ మగ వాడికీ చోటివ్వని ఆ అమ్మాయి సన్నని మూలుగులు పక్కనాకు వినబడుతూనే ఉన్నాయ్.

పది నిముషాలు గడిచినయ్. ఆమె లేచి తన గుడ్డలు సరిచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ తన డ్రెస్ తొడుక్కున్నాడు.

"నీకో ముఖ్యమయిన విషయం చెప్పడం మరిచాను. ఈ చుట్టుప్రక్కల ఏదో రాకెట్ వచ్చి పడిందట. సైన్యం దానికోసమె గాలిస్తున్నది. వీలైనంతమటుకు నీవు బయటి ఊళ్ళకు వెళ్ళద్దు."

"ఎందుకని?"

"నీవు తల్లిదండ్రుల్ని అంటిపెట్టుకుని ఉండు. పొరుగూరులో సైనికులు నిన్ను చూసేరంటే నీ వక్కడకొత్తదానివని అనుమానిస్తారు. అదే ఇక్కడ అయితే నేను నీకేం అపకారం జరగకుండా చూస్తాను. ఏం?"

"అలాగే!"

"నీవు ఇంత తేలిగ్గా లొంగుతావని అనుకోలేదు. ఐనా నీవు పూర్తిగా సహకరించలేదు. నేను మరోసారి వీలు చూసుకుని వస్తాను. అప్పుడు నన్ను పూర్తిగా తృప్తి పరచకపోతే ఊరుకునేదిలేదు! అన్నట్టు ఈ చుట్టుపట్లను ఎవరూ కొత్తమనిషి రాలేదుకదా?" ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

"ఈ 'కియాంగ్నా'కి ఎవరొస్తారు ఇన్‌స్పెక్టర్" తేలికగా నవ్వుతూ అంది లీన్‌షూ.

అతడు నవ్వాడు. లీన్‌షూని మరోసారి కౌగలించుకుని గాఢంగా ముద్దుపెట్టుకున్నాడు.

ఆ తర్వాత చకచకా నడిచి బయటకు వెళ్ళిపోయాడు. లీన్‌షూ గేట్లో నిలబడి సైకిలెక్కి వెళ్ళిపోతున్న ఇన్

స్పెక్టర్ ఘుంగ్ లీ వంక ద్వేషంగా చూసింది.

వినయ్ సక్సేనాకు తనమీద తనకే అసహ్యం వేసింది. తన కళ్లముందర ఒక యువతి తన రక్షణకోసం తన శీలాన్ని బలిచేసుకుంటే సహించలేకపోయాడు. గడ్డిని ప్రక్కకు తోసేసి లేచాడు. భారతదేశంనుంచి సహాయం వస్తుందో రాదో! ఆలస్యమయేకొద్ది చైనా సేనలు తనకోసం ప్రతి గజం మేరా వెతుకుతూ వస్తారు. వారి చక్రబధంలో తను బిగవకముందే తప్పించుకోవాలి. రాకెట్ ఎక్కడ కూలిపోయిందో తనే వెతుక్కుంటూ వెళ్ళి, అందులోని ముఖ్యమైన టేప్ లూ, మీటర్లూ తీసుకుని ఎలా తప్పించుకోవాలో ఆ మార్గాన్ని వెతుక్కోవాలి. తనలాంటి మేజర్ ఇలా చేతులు ముడుచుకుని కూర్చోవటం ఏంబాగాలేదు అనుకున్నాడు.

ఒకవైపు కాలు బాధపెడుతున్నా లెక్కచేయకుండా నాలుగు గజాలు నడిచాడు. ఆ తర్వాత అతడు కాలు మోపిన చోట రాయి కదిలిపోయింది. తమాయించుకోలేక అతడు పడిపోయాడు. తలకు దెబ్బ తగిలింది. తర్వాత అతడికి స్పృహ తప్పిపోయింది.

5

నేలంతా తడితడిగా ఉంది. ఆకాశంలో మబ్బులు కమ్మి మళ్ళీ వర్షించేలా ఉంది. మబ్బులు కమ్మటం మూలాన్ని అది ఉదయమో, సాయంకాలమో గూడ తేడా తెలీటంలేదు.

కిరణ్ కుమార్ తన ప్రక్కనున్న వ్యక్తిని పేషెంట్ ని నడిపించే డాక్టర్ లా ఒకచేత్తో పట్టుకుని అడుగులు వేయిస్తున్నాడు. మగవేషంలో ఉన్న ఆ వ్యక్తి మేరీ. అతడిచ్చిన ఇంజెక్షన్ ప్రభావం ఇంకా పోలేదు. అందుకే

ఆమె పిచ్చిదానిలా చూస్తూ అతడు నడిపించినట్టుగా నడుస్తోంది.

హాంగ్ కాంగ్ లోని హో-యాంగ్-హో నది ఒడ్డున ఒక ఓడరేవు అది. తీరం అంతటా పడవలతోనూ లాంచీలతోనూ సందులేకుండా ఉంది.

ఒక లాంచీ దగ్గరకు వెళ్ళి "'సీ డ్రాగన్'ని చేరుకునే లాంచీ ఏదీ?" అని అడిగాడు కిరణ్ కుమార్. లాంచీ అంచుమీద కూర్చుని వ్రేలాడుతున్న ఒక వ్యక్తి ఒడ్డుకు దూకి వారికి దగ్గరగా వచ్చాడు.

అతడు అయిదున్నరడుగుల ఎత్తు ఉన్నాడు. నల్లగా, బలిష్ఠంగా ఉన్నాడు.

"ఎవరు మీరు? వరదకాలంలో వచ్చారేం?" అని అడిగాడు అతడు.

"వాన అయినా వరద అయినా మేం వెనుదీయం. మేము భారతీయులం!" చిన్నగా గొణిగాడు కిరణ్ కుమార్. కోడ్ వర్డ్ చెప్పాడు.

నల్లని వ్యక్తి అతడివంక ఎగాదిగా చూశాడు "నీ పేరు?"

"కిరణ్ కుమార్!"

"నేను మరో పేరు విన్నానే!"

"అతడు శత్రువుల చేత చంపబడ్డాడు. అందుకే నేను వచ్చాను అతడి స్థానే."

"ఉదయంనుంచీ మీ కోసం ఎదురుచూస్తున్నాను. ఎవరూ రాకపోవడంతో విసుగెత్తింది. సాయంత్రందాకా ఎవరూ రాకపోతే తిరిగి వెళ్ళిపోదామనుకున్నాను. ఇక పదండి వెడదాం! ఈ నదిలో, మనం ఇరవయ్ మైళ్ళు ప్రయాణం చేస్తేకాని 'సీ డ్రాగన్'ని చేరలేం!"

ముగ్గురూ నడిచారు ముందుకు. ఇది హోయాంగ్ హో

నది అయి ఉండాలనుకున్నాడు కిరణ్ కుమార్.

"ఈ అబ్బాయి ఎవరు?" మూడో వ్యక్తి అడిగాడు.

"అబ్బాయి కాదు! అమ్మాయి! నా సెక్రటరీ! అన్నట్టు నీ పేరు?"

"వాంగ్-ఛూ! 'సీ డ్రాగన్' స్టీమరులో ఓడనడిపే పైలెట్ని."

ముగ్గురూ పెద్ద తెప్పలోకి ఎక్కారు. "నేను కాపలా కాస్తుంటాను. మీరు తెడ్లువేయండి. ఇన్స్పెక్షన్ కని సెర్చిలైట్లుమీద పడేటప్పుడు ఒరిగి కూర్చోండి" వాంగ్-ఛూ చెప్పాడు.

ప్రవాహంలో తెప్ప ముందుకు జారుతోంది ఆట్టే తెడ్లు వేయకుండానే. మేరీ ఇంకా మత్తులోనే ఉంది. యాంత్రికంగా చెప్పిన పనులు చేసుకుపోతోంది.

మధ్యమధ్యలో పాట్రోల్ లాంచీల్లోంచి సెర్చిలైట్లు వచ్చి పడుతున్నాయ్. అప్పుడు మాత్రం ఇద్దరూ తెప్పలోని సరుకుల చాటుగా వంగి కూర్చుంటున్నారు.

నది పొడుగునా లాంచీలు, మోటార్ బోట్లు, నాటు పడవలూ రెండు వేపులా లంగర్లువేసి ఉన్నాయ్. మరి కొన్ని ప్రవాహానికి ఎదురుగా ప్రయాణిస్తున్నాయ్. నది చాలా వెడల్పుగా ఉండటంచేత ఒకదానికొకటి ఎదురు పడకుండా సాగిపోతున్నయ్.

నాలుగు గంటలు ప్రయాణం చేసిన తర్వాత తెప్ప సముద్రం చేరుకుంది.

దూరంగా సముద్రంలో 'సీ డ్రాగన్' లంగరు వేయ బడి ఉంది.

"ఓడ కాప్టెన్ ఆశాపరుడు. అతడికివ్వటానికి డబ్బు తెచ్చారా?"

"పది బంగారు బిస్కెట్లు! పని అయింతర్వాత మా

దేశంనుంచి ఇంకో పెద్ద బహుమతి దొరుకుంది."

"తుపాకీ వాగ్దానాలకు వాడు లొంగే రకంకాదు. కొంచెం తక్కువైనా బంగారం వాడి ముఖాన విసిరికొట్టితే సరి!"

తెప్ప స్టీమరు దగ్గరకు చేరింది. పైనించి త్రాటినిచ్చెన దింపబడింది. దాని మీదుగా ముందు మేరీ ఎక్కింది, తర్వాత కిరణ్‌కుమార్ ఎక్కాడు.

వాంగ్-ఛూ తెప్ప మరో వ్యక్తికి అప్పజెప్పి అతడి చేతిలో ఒక బంగారు బిస్కట్‌ని పెట్టాడు. అతడు కళ్ళు పెద్దవిచేసి దాన్ని చూశాడు.

"దాచుకోరా పుండాకోర్! పోలీసులు చూశారంటే..." వాంగ్-ఛూ తర్వాత అనకుండానే వాడు దాన్ని చొక్కా లోపలి జేబులో దాచేసుకున్నాడు.

వాంగ్-ఛూ తాడు నిచ్చెన మీదుగా స్టీమరులోకి ఎక్కాడు. డెక్‌మీద ఓడ కెప్టెన్ సాలూంగ్ వాళ్ళ ముగ్గురివంకా అనుమానంగా చూశాడు.

"వీళ్ళేనా నీవు చెప్పింది?" వాంగ్-ఛూని ఉద్దేశ్యించి అడిగాడు.

"అవును! ఇతడే నేను చెప్పిన గూఢచారి. ఈ మగ వేషంలో ఉన్న స్త్రీ అతడి సెక్రటరీ అట."

"గూఢచారివెంట సెక్రటరీ ఎందుకు?" అతడు వికటంగా నవ్వాడు.

"ఆమెగూడ మరో గూఢచారిణి!" కిరణ్‌కుమార్ జవాబు చెప్పాడు.

"అలా చెప్పు! సరే! వాంగ్-ఛూ! నేను చెప్పినది సిద్ధంచేశావా?"

వాంగ్ ఛూ కిరణ్‌కుమార్‌కి సంజ్ఞ చేశాడు. తనభుజానికి తగిలించుకున్న కిట్ జిప్‌లాగి అందులోనుంచి

ప్యాకెట్ ని అందించాడు.

దాన్ని ఊడదీసి చూశాడు కెప్టెన్ సాలూంగ్. దాన్నిండా బంగారం బిస్కట్లు పదివున్నయ్. కెప్టెన్ కళ్ళు వింతగా మెరిసినయ్.

"సరే! వీళ్ళిద్దర్నీ స్టోర్ రూమ్‌లో దాచిపెట్టు. కస్టమ్స్ అధికారుల ఇన్‌స్పెక్షన్ కాంగానే పైకి రావచ్చు."

వాంగ్ ఘూ తల ఊపాడు. తనవెంట రమ్మన్నట్టు సైగ చేసి ముందుకి కదిలాడు.

"కెప్టెన్ నేనొకసారి ఒడ్డుకు వెళ్ళి రావచ్చా?" అనడిగాడు కిరణ్ కుమార్.

కెప్టెన్ కోపంగా చూశాడు అతడివేపు. "నీకేం మతిపోలేదుకదా? నిన్ను దొంగచాటుగా దాటేస్తున్నాం. ఈ సంగతి పోలీసులు పసిగట్టారంటే స్టీమర్ని యిక్కడే ఆపేస్తారు!" అని అరిచాడు. "మొత్తానికి భలే తెలివైన వాళ్ళనే ఎక్కించావ్? సముద్రంలోకి దూకుతారో, పోలీసుల చేతుల్లోపడి జైలుకెళ్తారో వెళ్ళమను!" అని వాంగ్-ఘూ కేసి చూశాడు.

"వాళ్ళ మనిషి నెవరో ఎత్తుకుపోయారట! అందుకని అతడు కొంచెం బాధపడుతున్నాడు. అంతకన్న మరేం లేదు!" వాంగ్-ఘూ సర్ది చెప్పాడు.

"సంతోషించాలే! వీళ్ళను క్రిందకు తీసుకువెళ్లు ముందు. ఆ గదిలో వీళ్ళను ఉంచి గదికి తాళంవేయి. లేకపోతే సమయం సందర్భం లేకుండా డెక్ మీదకు రాగలరు!"

కిరణ్ కుమార్, వాంగ్-ఘూ వెనకాలే నడిచాడు. అరుణ! ఆమె ఎక్కడుందో, ఎన్ని కష్టాలు పడుతూందో! తను ఆమెకు సహాయం చేసే స్థితిలో లేడు.

నిచ్చెన మీదుగా దిగి లోపల గదిలోకి వెళ్ళారు ముగ్గురూ. ఇంజన్ రూమ్ ప్రక్కనే ఉంది స్టోర్ రూమ్.

"ఆ కెప్టెన్ ముక్కోపి. కాని మంచివాడే. కాస్సేపు ఉంటే వాడి కోపం అదే చల్లారుతుంది. ఇతగాడి భార్యా, పిల్లల్ని రెడ్ గార్డ్స్ చంపేశారు. ఇతడూ చైనావాడైనా ఆ దేశం అంటే మీ కంత స్నేహమో అతగాడికీ అంతే!"

"కస్టమ్స్ వాళ్ళు ఓడ అంతా చెక్ చేస్తారా?" కిరణ్ కుమార్ అడిగాడు.

"లేదు! ఏదో రొటీన్ చెకింగ్. వాళ్ళ మామూళ్ళు పుచ్చుకుని వెళ్ళిపోతారు. ఓడలో మీకంటె విలువైన సరకు ఉంది. అది వాళ్ళ కంటబడితే, ఓడనే ప్రేల్చేస్తాడు కెప్టెన్. నేను మళ్ళీ వచ్చేటప్పుడు మీకు చైనా దుస్తులూ, ప్యాస్‌పోర్టులూ తెస్తాను" అంటూ వాంగ్-ఛూ బయటకు వెళ్ళి తలుపులు మూసేసి బయట తాళం వేశాడు.

6

వినయ్ సక్సేనా మౌనంగా బెడ్ మీద పడుకున్నాడు. లీన్‌షూని పలకరించటానికే అతడికి బాధగా ఉంది. ఆమె తనమీద కారాలూ, మిరియాలూ నూరుతున్నది. తను ఆ ఇంటినుంచి బయటపడడానికి ప్రయత్నించి పడిపోయాడు. ఇంట్లో లేకపోవడం చూసి తనను వెతుక్కుంటూ వచ్చింది లీన్‌షూ.

పడిపోయిన తనకు చేయూతనిచ్చి మళ్ళీ వెనక్కు తీసుకువచ్చింది.

"లీన్‌షూ! నువ్వు కోప్పడకుండా ఉంటే ఒకమాట!" అన్నాడు సక్సేనా.

"ఏం?" అంటూ ఉరిమింది లీన్‌షూ.

"నా క్యాప్సుల్‌ని ఒకసారి చేరుకోవాలి. ముఖ్యమయిన టేప్‌లూ అంతరిక్ష పరిశోధన లేబరటరీకి అప్పగించవలసిన పరికరాల్ని తీసి భద్రపరచాలి. అవి లేకపోతే నేను మా దేశం తిరిగిపోవడం శుద్ధ దండుగ. ఏదన్నా పాయిజన్

మింగి చనిపోవటం మేలు."

లీన్‌షూ అతని మాటలకు కరిగిపోయింది. "ఘుంగ్‌లీ నన్ను బలాత్కరించటం చూసి సహించలేక నీవు పారిపోయావేమో అనుకున్నాను. ఇదే నీవు మీ దేశంలో రాలి ఉంటే, ఈ పాటికి నీకు ఎన్నో సన్మానాలూ, బహుమతులూ అంది ఉండేవి!" ఆమె చేయూత ఇస్తే అతడు నడవసాగాడు. ఇద్దరూ కాప్సూల్ పడిన చోటికి బయలుదేరారు.

"అవును! నీవుకూడ నాతోపాటు మా దేశం వచ్చేయకూడదూ?"

"నేను వచ్చేస్తే ఈ ముసలి తల్లిదండ్రుల్ని ఎవరు చూస్తారు? నా తమ్ముడు వాంగ్-ఘూ ఎప్పుడూ సముద్రం మీదే ఉంటాడాయె!"

"దైవం అనుకూలించి నాకు సహాయం సకాలంలో అందితే మీ అందర్నీ నా దేశం తీసుకువెడతాను."

"మరీ అంతటి అత్యాశ కూడదు. ముందు వాంగ్-ఘూ తన పని ఎంతవరకూ నెరవేరుస్తాడో చూడాలి గదా?"

ఆకాశంలో పెద్దగా శబ్దం వినవచ్చింది. జెట్ ప్లేన్ ఎగురుతూన్న శబ్దం అది. ఇద్దరూ మౌనంగా విన్నారు ఆ శబ్దాన్ని. ఇద్దరిలోనూ ఆతృత ఎక్కువైంది.

"ఈ విమానాలు ఎప్పుడూ వస్తుంటాయా?" సక్సేనా అడిగాడు.

"లేదు! ఈ ప్రక్కగా ఎప్పుడూ విమానాలు రావు. ఇది మొట్ట మొదటిసారి జెట్ ప్లేన్ని చూడటం."

"అయితే నిస్సందేహంగా వాళ్ళు నా కోసమే వెదుకుతున్నారు. ఆకాశంలోంచి చూస్తే నేను దిగిన చోటు వాళ్ళకు స్పష్టంగా తెలిసిపోతుంది" నిస్పృహగా అన్నాడు సక్సేనా.

"అందుకూ అవకాశంలేదు. క్యాప్సుల్ చెట్లకొమ్మల్ని విరుస్తూ భూమిని తాకింది. దాన్ని చెట్లనీడల్లోకి లాగాం. పోతే పారాచూట్‌లను గోతిలో పడేసి పైన ఆకుల లములు కప్పాం."

"ఏమో! కాసేపు నేను సురక్షితంగా బయటపడలే నేమో అని నిస్పృహ నన్ను ఆవరిస్తోంది. మరి కాసేపు వాంగ్-ఛూ తనవెంట భారత ఏజెంట్లను వెంటబెట్టుకు వస్తాడని ఆశగా ఉంది."

"అన్నట్టు నీ ప్రియురాలు అరుణకోసమన్నా నీవు ఆత్మహత్య చేసుకోకూడదు. ఆమె అందంగా ఉంటుందా? నాకంటె గూడానా?" లీన్‌షూ అడిగింది.

"నీకంటె అందగత్తె కాదు" అన్నాడు సక్సేనా.

"అబద్ధం! ఆమె నాకంటె సుకుమారంగానూ, అందంగానూ ఉండవచ్చు. పల్లెలో మోటుపనులు చేస్తూ మొరటు చేతులు గలదాన్ని. పైగా పోలీసు వాడిచేత మోటుగా బలాత్కరింపబడిన దాన్ని."

"నిజంగానే చెబుతున్నాను!"

"నువ్వు అబద్ధాలకోరువి. నేనేమన్నా కష్టపెట్టుకుంటా నేమో అని అలా చెబుతున్నావ్! అయినా నువ్వంటే ఎందుకో నాకు అభిమానం కలుగుతోంది."

ఇద్దరూ పొదలచాటుగా, చెట్ల క్రీనీడల్లో నడుస్తూ రెండు గంటలు ప్రయాణించారు. నేలంతా ముళ్ళూ, కంపలతో నిండి త్వరగా నడవటానికి ఆటంకం కలిగించి నయ్. పైగా సక్సేనా, కాలి బాధతో త్వరగా నడవలేక పోయాడు. రహదారి వెంట వెడితే ఎవరైనా ఎదురుపడ వచ్చని అడ్డదారినే తీసుకువెడుతోంది లీన్‌షూ.

ఈ లోపల ఆకాశంలో జెట్ విమానం మరోసారి విహారంచేసి కొండల చాటున అదృశ్యమయింది.

వారు నిల్చున్న ఎత్తైన గుట్టమీదినుంచి చూస్తే 'కియాంగ్సూ' గ్రామం స్పష్టంగా కనబడుతోంది. ఆ గ్రామం చాలా చిన్నది. అన్నీ గుడిసెలే! మొత్తం రెండు వందల ఇళ్ళు వుంటాయేమో! లీన్‌షూ నివసించే ఇల్లు ఊరికి చాల దూరంగా, వెలివేయబడినట్టుగా ఉంది. గ్రామానికి ఒక మైలు దూరంలో ఎర్రని రోడ్డు, రోడ్డుకి వందగజాల దూరంలో యాక్సికియాంగ్ నది పారుతున్నది.

"నాకు ఆ ఇన్‌స్పెక్టర్ మీద చెప్పలేనంత కోపం వచ్చింది" అన్నాడు సక్సేనా.

"వాడు చేసిన పనికి నా చేతిలో వాడి చావు రాసి వుంది. అయినా నీవు ఇంకా ఆ విషయం గురించే ఆలోచిస్తున్నావా?"

సక్సేనా ఆయాసంతో ఆగాడు. అతడికి దగ్గరగా నిలబడి ఉంది, లీన్‌షూ. ఆమెను దగ్గరకు తీసుకుని ఆమెను పెదవులమీద ముద్దుపెట్టుకున్నాడు తేలికగా. ఆమె ప్రతిఘటించలేదు. చేతోతన పెదవిమీది తడిని తుడుచుకుంది.

"నన్ను లోకువ కట్టేస్తున్నావ్. నీ కళ్ళముందే నన్ను ఆ పోలీసువాడు బలాత్కరించాడని నేను నీ దృష్టిలో చులకనయ్యానా?"

"అలా అనకు! నీవు నా ప్రాణం కాపాడిన దేవతవు!"

"చాల్లే! పొగడ్తలు ఆపు! నీవు నా ముందు ఇలా మాట్లాడావని అరుణకు తెలిస్తే ఆమె కోపం తెచ్చుకోగలదు" అంటూ లీన్‌షూ నవ్వింది.

వినయ్ సక్సేనా చిరునవ్వు నవ్వాడు. ఇద్దరూ ముందుకు సాగారు మళ్ళీ.

ఇప్పుడు అరుణ ఏం చేస్తుంటుందో! ఆమె తనను గురించే ఆలోచిస్తుంటుందా తన ఇంట్లో తీరికగా కూర్చుని? అనుకున్నాడు సక్సేనా.

7

"ఆమె నిజంగా నీ సెక్రటరీయేనా?" వాంగ్-ఛూ నిదానంగా అడిగాడు.

"కాదు!" తలవంచుకునే సమాధానమిచ్చాడు కిరణ్.

"నమ్మదగ్గ మనిషేనా? ఇక పైనుంచి ప్రతి రేవులోనూ మన ఓడను అధికారులు చెకింగ్ కోసం ఒకపూట, ఒక రోజల్లా గూడ ఆపుచేస్తారు. అధికారుల ముందు ఆగం చేసి మన సంగతి బయటపెట్టదు గదా?"

"అలా చేయదనే నా నమ్మకం!"

"ఆమె తమ్ముడి సంగతేమిటి? మనం అతడ్ని తేగలమా?"

"పులినోట్లో తలదూర్చటమే!"

"వచ్చే రేవులోనే మనం దిగితే ఆమె తమ్ముడున్న చోటికి తేలిగ్గా పోవచ్చు. ఆమెగూడ పాపం అతడ్ని గురించి గగ్గోలు పెడుతున్నది."

"మనం అక్కడికి వెళ్ళాలంటే తగిన ఆయుధాలు అన్నా ఉండాలిగదా!"

"ఆయుధాలా?" అని నవ్వాడు వాంగ్-ఛూ. తన చుట్టూ ఒకసారి కలయజూసి దగ్గర్లో ఎవరూ లేరని నిర్ధారణ చేసుకుని మళ్ళీ అన్నాడు. "ఈ ఓడలో ఒక బెటాలియన్ సైన్యానికి సరిపడే ఆయుధాలున్నై. హ్యాండ్ గ్రెనేడ్స్, మోర్టార్స్, రైఫిల్స్, మిషన్ గన్స్, ఆటోమేటిక్ పిస్టల్స్ వీటికి సరిపడే మందుగుండు సామానూ ఉంది. ఎవరన్నా శత్రువులకు మన సమాచారం తెలిస్తే ఓడనే ప్రేల్చివేయటానికి అనువుగా అన్నీ వైర్‌తో కనెక్షన్ చేయబడినై."

"నిజంగా పేల్చేస్తారా అపాయం వస్తే!"

"వాళ్ళ చేతుల్లో చిత్రహింసలుపడి వాళ్ళ ప్రశ్నలకు జవాబులు చెప్పేకన్నా అదే నయం. అంతేకాక ఈ

ఆయుధాలు చైనీయులకు దక్కరాదు. అందుకని ఓడలోని సరుకులూ, మనుషులతో సహా ఓడ పేలిపోతుంది."

"మనం ఎప్పుడు లంగరెత్తేది ఇక్కడనుంచి?"

"ఇంకో గంటలో బయలుదేరదాం. వచ్చే రేవులో మన ఓడని ఒకటి రెండురోజులు ఆపాల్సి వస్తుంది. ఇంజెన్ రూమ్‌లో వెల్డింగ్ పనులు చేయించాలట."

"ఎక్కడికక్కడ ఇలా రోజుల తరబడి మనకు ఆలస్యం అయితే మరీ ఆలస్యం అవుతుందేమో!"

"ఏం ఫరవాలేదు. అతడు మా ఇంట్లో సురక్షితంగా ఉంటాడు."

"ఇంతకీ అతడెక్కడున్నదీ చెప్పనేలేదు నీవు!"

"యాక్సికియాంగ్ నదీతీరం వెంబడే కియాంగ్సూ అనే చిన్న గ్రామంవుంది. ఆ గ్రామంలో ఊరికి వెలుపలగా నా ఇల్లువుంది. అక్కడే ఉన్నాడు వినయ్‌సక్సేనా!"

"ఇలా నదిలో నిదానంగా వెళ్ళేకంటే నేలమీదుగా పోతే మనం త్వరగా వెళ్ళగలమేమో!" కిరణ్ అడిగాడు.

"లాభంలేదు! దోవలో అన్నీ పల్లెలు. కొత్త మనిషిని ఇట్టే పసిగట్టేస్తారు" వాంగ్ ఛూ పెదవి విరిచాడు.

"ఇంతకూ మేరీ తమ్ముడి విషయం ఏమిటి? వచ్చే రేవులో ఓడ లంగరు వేయంగానే మనం బయలుదేరితే తిరిగి సాయంత్రానికి వచ్చేయచ్చు అతడ్ని వెంటబెట్టుకుని" వాంగ్ ఛూ మళ్ళీ అడిగాడు.

"చూదాం!"

కెప్టెన్, కస్టమ్స్ అధికారుల వెంట డెక్ మీదకు వచ్చాడు. వాంగ్-ఛూ ఓడ చక్రం ముందుకు వెళ్ళి నిలబడ్డాడు.

కిరణ్ కుమార్ తన గదికి చేరుకున్నాడు తిరిగి, అధికారులు వెళ్ళిపోంగానే,

"వాంగ్ ఛూ గూడ నీకు సాయంగా ఉంటానన్నాడు నా తమ్ముడ్ని రక్షించే ప్రయత్నంలో."

కిరణ్ కుమార్ విసుక్కున్నాడు. "నేను యింత కష్టపడి, ప్రాణాలకు తెగించి వచ్చింది నీ తమ్ముడ్ని రక్షించటానికి కాదు! అక్కడ నేలమీదకు దిగిపోయిన సక్సేనాని విడిపించాక గాని అటు అరుణనికాని, ఇటు నీ తమ్ముడ్ని గాని విడిపించే యత్నం చేయటానికి వీలుండదు."

మేరీముఖం చిన్నబుచ్చుకుని పడుకుంది తన ప్రక్కమీద. కిరణ్ కుమార్ ఆమె ప్రక్కగా తన ప్రక్క పరుచుకుని పడుకున్నాడు. మేరీ అటుతిరిగి పడుకుంది. ఆమె నిద్రపోతున్నదో, మెలకువలో ఉన్నదో!

తనకంటె ముందు బయలుదేరిన ఏజెంట్ హత్య చేయబడిన తీరు గురించే ఆలోచిస్తూ చాలాసేపు మెలుకువగా ఉన్నాడు. ఓడ సాగంగానే అతడికి నిద్రపట్టింది.

అతడికి మెలకువ వచ్చేసరికి తెల్లవారింది. అతని ప్రక్కన మేరీలేదు. ఓడ, రేవుని చేరినట్టుంది లంగరేసి ఆగివుంది. కిరణ్ కుమార్ మనసు ఏదో కీడుని శంకించింది. లేచి గబగబ డెక్ మీదకు వెళ్ళాడు. స్టీరింగ్ వీల్ ముందు వాంగ్ ఛూ నిలబడి కాఫీ త్రాగుతున్నాడు. డెక్ మీద నాలుగు ప్రక్కలా కలయజూశాడు కిరణ్ కుమార్.

"కాఫీ త్రాగుదాం రండి!" అంటూ కిరణ్ కుమార్ కి మరో పింగాణీ గిన్నెలోకి కెటిల్ లోంచి కాఫీ వంచి పోశాడు.

"మేరీ వచ్చిందా డెక్ మీదకు?" కాఫీ త్రాగుతూ అడిగాడు కిరణ్.

"డెక్ మీదకు రాలేదే? గదిలో లేదా ఆమె?" వాంగ్ ఛూ కంగారుగా అడిగాడు.

"లేదు. ఒకవేళ ఆమెగాని..." అంటూ కిరణ్

కుమార్ ఆగిపోయాడు వాంగ్ ఛూ కళ్ళల్లోకి చూస్తూ.

"అవును! నా భయంగూడ అదే! ఆమె తమ్ముణ్ణి రక్షించటానికి వీలవదని అంత నిష్కర్షంగా చెప్పకుండా ఉండాల్సింది!"

ఇద్దరూ ఓడ అంతా కలయ తిరిగి వెదికారు. మేరీ దొరకలేదు. కెప్టెన్‌ని అడిగారు ఆమె గురించి.

"అది సముద్ర ప్రయాణంతో విసుగెత్తి భూమిమీదకు పారిపోయి వుంటుందిలే!" అని చప్పరించాడు కెప్టెన్.

"ఆమె తన పైఅధికారి ప్యావోని కలుసుకుని మన ఓడగురించి చెప్పిందంటే చైనా సైన్యం అంతా పరుగెత్తుకొస్తారు మనకోసం!" కిరణ్‌కుమార్ ఆదుర్దాగా చెప్పాడు.

"అవునా?" అని వాంగ్ ఛూ వంక చూస్తూ అడిగాడు కెప్టెన్.

"ఆమె అంత తేలిగ్గా చెప్పదనుకోండి!" వాంగ్ ఛూ ఆమెని సమర్థించబోయాడు.

"కాని ఆమెకు మనగురించి సర్వం తెలుసు. అతను చెప్పేదే కరెక్ట్. ఆమె మనల్నందర్ని వెధవల్ని చేసి తప్పించుకోబోయింది. ఆమెను నీ పక్కలో వేసుకుని, గట్టిగా కౌగలించుకుని పడుకుని ఉండాల్సింది. ఇప్పుడేం చేయటం! వాంగ్ ఛూ! నీవు వెళ్ళి ఆమెను లాక్కురాగలవా సాయంత్రంలోగా!"

"నేనూ ఇతడూ గూడ వెడతాం!"

"ఊఁ! వెళ్ళండి!" అని అరిచాడు కెప్టెన్.

8

రేవులోని జనంలోంచి తోవచేసుకుని కిరణ్‌కుమార్, వాంగ్ ఛూ ఇద్దరూ బస్ ఎక్కారు. ఇద్దరూ మౌనంగా

ఎవరి ఆలోచనల్లో వారున్నారు. చిన్న చిన్న పల్లెల్లోంచి బస్ పోతున్నది. ఆ పల్లెల్లో ఎక్కువగా పూరిళ్ళు, బంగళా పెంకులతో కట్టిన ఇళ్ళేగాని మేడలు కనబడలేదు కిరణ్ కుమార్‌కి. ప్రతి గ్రామంచుట్టూ దట్టంగా చెట్లూ, వందల కొలదీ ఎకరాల్లో పైరూ పచ్చగా కనబడుతున్నయ్.

ఒకగంట ప్రయాణం తర్వాత ఇద్దరూ ఒకచోటదిగారు. రోడ్డుప్రక్క నేవున్న బడ్డీ హోటల్లోకి వెళ్ళి టిఫిన్ చేసి, టీ త్రాగారు. పావుగంట గడిచేసరికి మరో బస్ వచ్చింది. మళ్ళీ అందులోకి ఎక్కారు ఇద్దరూ.

గంటన్నర బస్సు ప్రయాణం వాళ్ళను ట్సియాంగ్ చేర్చింది. వాంగ్ ఛూకి ఈ ప్రదేశాలన్నీ క్షుణ్ణంగా తెలుసు కాబోలు చకచకా జనాన్ని తోసుకుని ముందుకు పోతు న్నాడు. ఆవు వెంటపోయే దూడలా కిరణ్ కుమార్ అతడ్ని అనుసరిస్తున్నాడు.

మార్కెట్ దగ్గర ఆగిపోయాడు వాంగ్ ఛూ.

"అదిగో! ఆ టక్కులాడి మనకంటె ఎంత ముందర వచ్చిందో!" అన్నాడు వాంగ్ ఛూ.

అతడు చూపిన దిక్కుగా చూశాడు కిరణ్ కుమార్. మార్కెట్‌కి ఎదురుగా పెద్ద హైస్కూలు, ఆ ఆవరణ లోనే హాస్టలూ ఉంది. మేరీ గేటులో నిలబడి లోపలకు వెళ్ళేవారివంక కళ్ళు పెద్దవిచేసుకుని చూస్తున్నది.

అయితే ఆ గుంపుల్లో తన తమ్ముడు కనుపించలేదు ఆమెకు. అయినా ఆమె ప్రక్కగా నిలబడి ఇంకా వెతుకు తూ నేవుంది ఆతడికోసం.

"ఆమెని వెళ్ళి కలుద్దామా?" వాంగ్ ఛూ అడిగాడు.

"వద్దు! అంటిపెట్టుకుని ఎన్ని నేత్రాలు కాపలా కాస్తున్నయ్యో! మనకోసం వాళ్ళు వలపన్నే ఉంటారు!"

"మరిప్పుడేం చేయడం!"

"ఆమెని ఎవరన్నా కనిపెట్టుకుని ఉన్నారేమో చూద్దాం!" అన్నాడు కిరణ్ కుమార్.

ఈలోపల మేరీ గేటు ఈ చివరినుంచి ఆ చివరకు మారింది. ఆమె అచ్చం చైనాలో వరిపొలాల్లో పనిచేసే మోటువనితలా వుంది.

"ఎంతకు తెగించింది ఆడదైనా? పోనీ నేను వెళ్ళి ఆమెను కలవనా? ప్యావో నీకోసం వలపన్ని ఉండచ్చు. అదే నేను వెడితే! అతడు నన్నెరుగడుగదా? ఎవరో ఊళ్ళోని వ్యక్తిగా ఉపేక్షిస్తాడేమో!"

"తొందరపడద్దు. మనం ఆమె వెనకే తప్పకుండా వస్తామని వాళ్ళు మనల్ని ట్రాప్ చెయ్యటానికి రెడీగా ఉంటారు! ఒకపని చెయ్! ఒకసారి స్కూలు ఆవరణ చుట్టూ తిరిగిరా!"

వాంగ్ ఛూ జేబుల్లో చేతులు దూర్చుకుని సన్నగా ఈలపాట పాడుకుంటూ ముందుకు వెళ్ళాడు. స్కూలు చుట్టూ తిరిగి పావుగంటలో తిరిగి వచ్చాడు.

"నీ ఊహ కరక్టే గురూ! రెండు మిలిటరీ వ్యాన్లు ఒక కొత్తకారు స్కూలువెనుక గేటుదగ్గర ఉన్నయ్. ఎవరో బోడిగుండువ్యక్తి లోపల నిలబడివున్నాడు. అతడి ముందు నమ్రతగా మరో నలుగురైదుగురు సైనికులున్నారు. వాళ్ళందరి చేతుల్లో ఆయుధాలున్నై!"

కిరణ్ కుమార్ ఒక్క నిముషం ఆలోచించాడు. "నేను వెళ్ళి మేరీని కలుస్తాను. ఇద్దరం లోపలకు వెళ్ళి ఆమె తమ్ముడ్ని తీసుకొస్తాం. ప్యావో మమ్మల్ని చుట్టుముడతాడు. మమ్మల్ని ఎస్కార్ట్‌తో కారులో ఎక్కిస్తాడు. డ్రైవర్ పోనీ! అంటాడు సంతోషంగా. కాని ఆ డ్రైవర్ స్థానంలో నీవుంటావ్! నీచేతిలో ఆటోమేటిక్ పిస్టల్ ఉంటుంది. దాన్ని ప్యావో గుండెల కానిస్తావ్

నీవు! అర్థమయిందా?” కిరణ్ కుమార్ వేగంగానూ, స్పష్టంగానూ పలికాడు.

“కానీ మనం పులితో చెలగాట మాడుతున్నామేమో!”

“అంతకన్న గత్యంతరం లేదు! మన చావు బ్రతుకులు నీ చేతుల్లో ఉన్నయ్. అదుర్దా పడవద్దు. ఉద్రేకాన్ని తెచ్చుకోవద్దు. నింపాదిగా, నిదానంగా, నికరంగా పని సాగించు! ఓ కే!” అంటూ కిరణ్ కుమార్ ముక్కుకు సూటిగా నడిచి మేకీ ప్రక్కకు వెళ్ళి నిలబడి సిగరెట్ వెలిగించాడు.

ఆమె అతడివంక నిర్లక్ష్యంగా చూసి మళ్ళి ముఖం తిప్పేసుకుంది.

“నాతో చెపితే నేనూ వచ్చేవాడ్నిగదా! అలా దొంగ చాటుగా రాకపోతే!” ఎటోచూస్తూ అన్నాడు కిరణ్ కుమార్.

“నిన్ని ట్రాప్ లోకి రాకుండా చేయాలనే నేను వచ్చేశాను.”

“ట్రాప్ వేశారంటావా?”

“ఇంతకుముందే ప్యావో నా తమ్ముడ్ని ఆడిటోరియంలో తన ప్రక్కన కూర్చోబెట్టుకుని నవ్వుతూ మాట్లాడుతుండగా చూశాను. వారికి భయపడే నేను వెనక్కు వచ్చేసి ఇక్కడపొంచి ఉన్నాను. కాని వాడు ఈ పాటికి నన్ను చూసే ఉంటాడు.”

“మరయితే నిన్ను పట్టుకోకుండా వదిలేశాడేం?”

“బహుశా నీవుగూడ వస్తేగాని తనపని పూర్తిచేసుకోడేమో!”

“అలాగా! అయితే పద! లోపలకువెళ్ళి నీ తమ్ముడ్ని

కలుద్దాం!'' అన్నాడు ఆమె చంకక్రిందుగా తన చేతిని పోనిస్తూ.

"వద్దు. అతడు నిన్ను బంధిస్తాడు. చంపినా చంపచ్చు. పైగా నేను ఇండియన్ ఏజెంటుతో సహకరించానని నాపై నేరం విచారిస్తారు."

"నీ తమ్ముడు కావాలంటే నాతో రా! నన్ను ఇక్కడకు నా ఇష్టానికి వ్యతిరేకంగా రప్పించావు నీవు. నేను రాకుండా ఉండేవాడ్నే. నిన్ను ప్యావో దొరకబుచ్చుకుంటే మా ఓడలోని రహస్యాన్ని తేలిగ్గా రాబట్టి వుండేవాడు నీనుంచి."

"నేను చెప్పేదాన్ని కాదు మీ గురించి!"

"వాదనకు ఇది సమయంకాదు! మేరీ వెనుకంజవేసి ఫలితంలేదు. పద! ముందుకుసాగు!"

"నాకు భయం వేస్తున్నది!" మేరీ అన్నది గువ్వలాగ ముడుచుకుపోయి.

"భయపడటానికి కూడా టైమ్ లేదు, నడు ముందు!" కిరణ్ కుమార్ అడుగులు వేశాడు ముందుకు. ఆమెగూడ అతన్ని అనుసరించక తప్పలేదు.

ఇద్దరూ ఆడిటోరియంలోని కుర్చీల దగ్గరకు వెళ్ళి చూశారు. మామూలుగా స్కూలుపిల్లలు కొందరు కూర్చుని ఉన్నారు అక్కడ. ప్యావోగాని మేరీతమ్ముడుగాని లేరు అక్కడ.

"ఏరి వాళ్ళు?" కిరణ్ కుమార్ అడిగాడు.

"ఇందాక వాళ్ళు ఇక్కడ కూర్చుని ఉండంగానే చూశాను. ఏరీ?" మేరీ ఆశ్చర్యంగా చూసింది.

కిరణ్ కుమార్ ఆ ప్రక్కనవున్న బాలుడ్ని అడిగాడు మేరీ తమ్ముడి గురించి. అతగాడు యింతకుముందే హాస్టల్లో తన గదికి వెళ్ళినట్టుగా చెప్పాడు.

ఇద్దరూ హాస్టల్ వేపు పరుగుతీశారు.

"అతడితోబాటు ప్యావో గూడ ఉంటాడేమో!" మేరీ భయంగా అంది.

"ఉంటే ఉండనీ. అతడి కోసమేగదా నేనూ వచ్చింది!"

ఆ వింగ్ లో చివరగావుంది అతడి రూమ్. గదిదగ్గరకు వెళ్లి "షాంగ్" అని నెమ్మదిగా పిలిచింది మేరీ.

తలుపు తెరుచుకుంది. "అక్కా! నిజంగా నీవే వచ్చింది!" అన్నాడు షాంగ్.

కిరణ్ కుమార్ అతడ్ని తోసుకుని లోపలకు వెళ్ళాడు. అతడి వెనకే మేరీగూడ లోపలకు వచ్చింది.

"త్వరగా నీకోటు తొడుక్కో! మనం ఇక్కడనుంచి వెళ్లిపోతున్నాం!" అన్నాడు కిరణ్ కుమార్, షాంగ్ ని ఉద్దేశించి.

అంతలోనే ప్యావో అనుచరులువచ్చి ముగ్గురినీ చుట్టు ముట్టారు.

స్కూలు వెనుక వేపు గ్రౌండ్లోంచి బయటకు వచ్చారు అందరూ. గేటు ప్రక్కగా రెండు మిలిటరీ ట్రక్కులు ఒక కొత్తకారు ఉన్నాయ్. ఆకారు అద్దాలు బుల్లెట్ ప్రూఫ్ అని గ్రహించాడు కిరణ్ కుమార్.

ప్యావో చకచక ఆర్డర్లు జారీచేశాడు.

"కిరణ్ కుమార్, మేరీ, ఆమె తమ్ముడ్ని వెనుక సీట్లో కూర్చోబెట్టండి. 'లూ!' నీవుగూడ పిస్టల్ గురిపెట్టుకుని వాళ్ళప్రక్కనే కూర్చో. డ్రైవర్! రెడీ!" అన్నాడు అతడు ముందుసీట్లో చేరగిలబడుతూ.

స్టీరింగ్ వీల్ ముందు కూర్చున్న వ్యక్తి పిస్టల్ తీసి ప్యావో గుండెలకు గురిపెట్టాల్సి ఉంది కిరణ్ కుమార్

లెక్క ప్రకారం.

"అలాగే సార్!" అంటూ డ్రైవర్ కారు స్టార్టు చేశాడు. వ్యూ ఫైండర్‌లో అతడి ముఖాన్ని పరీక్షగా చూశాడు కిరణ్‌కుమార్. అతడు వాంగ్‌ఛూ కాడు. తన ఆట ఇంతటితో కట్టు అనుకున్నాడు. అతడి కళ్ళలో అరుణ, వినయాసక్సేనా మెదిలారు.

9

కారు ఏదో కాలవమీద బ్రిడ్జి యెక్కింది. ఆ వంతెన కొయ్యది. కారు వంతెన సగంలో ఉండగా పెద్దగా ప్రేలుడు వినిపించింది. వంతెన కూలిపోయింది. అయితే కారు వంతెన చివరకు వచ్చేసింది.

డ్రైవర్ చేతిలో స్టీరింగ్ వీల్ అటూ ఇటూ తిరిగిపోయి కారు కుదుపులతో అటూ ఇటూ ఊగిపోయింది. రోడ్డు మీదనుంచి పల్లంలోకి దిగిపోయి గుట్టకు కొట్టుకుని ఆగిపోయింది.

ఈ అవకాశాన్ని కిరణ్‌కుమార్ బాగా ఉపయోగించుకున్నాడు. 'లూ' కుదుపులతో కారులో తల్లడిల్లుతుంటే అతడి చేతిలోని పిస్టల్‌ని లాగేసుకున్నాడు. ఒక్క షాట్‌తో అతడు కారుడోర్ తెరుచుకొని నేలమీద వెల్లకిల పడిపోయాడు.

మరో బుల్లెట్ డ్రైవర్ తలలో దూరింది. ప్యాపో సీటుకు కొట్టుకుని సగం కారులో సగం బయటకూ ఊగులాడుతున్నాడు.

ఈ తికమకలో షాంగ్ కారులోంచి బయటకు దూకి పారిపోబోయాడు. కిరణ్‌కుమార్ తన కాలుజాపి అతడి కాళ్ళకు బ్రేక్ వేశాడు. అతడు బోర్లా పడిపోయాడు.

కిరణ్‌కుమార్ భుజంమీద చేయి పడింది. విసురుగా అటు చూశాడు. అతడు యెవరో కాదు; వాంగ్-ఛూ!

"డ్రైవర్ సీట్లో నేను లేకపోవటంతో కొంత గాభరా పడి ఉంటావు కదూ?" అడిగాడు నవ్వుతూ. అతడి ప్రక్కన ఇద్దరు ముగురు కొత్తముఖాలు కనుపించినయ్.

"ఎవరూ వీళ్ళంతా!" అని అడిగాడు కిరణ్ కుమార్.

"వీళ్ళు నా స్నేహితులే! లోగడ ఒకసారి నేను వీళ్ళకు చాల సాయంచేశాను. మార్కెట్ లో నన్ను వదలి నీవు వెళ్ళంగానే వీళ్ళు కనుపించారు. నా ప్లాన్ గురించి చెబితే, 'ఆ డ్రైవర్ని లోబరుచుకునే ప్రయత్నం కొరివితో తల గోక్కోవటమే. దానికన్న వంతెన ప్రేల్చేయడం తేలిక' అని వాళ్ళే సలహా చెప్పారు. పైగా ప్యావో ఆ దారి వెంట తప్పకుండా వెళ్తాడని నమ్మించారు. అందుకే హడావిడిగా వంతెనను చేరుకుని మనతో తెచ్చిన డైనమైట్లను ఉపయోగించాను" వాంగ్ ఛూ సంతోషంగా జరిగినదంతా వివరించాడు.

వాంగ్ ఛూ స్నేహితులు వెళ్ళిపోయారు. కిరణ్ కుమార్ ప్యావోని లాక్కురమ్మన్నట్టు సైగ చేశాడు.

"ఆ ఫుండాకోర్ చచ్చాడా?" వాంగ్ ఛూ అడిగాడు.

"వాడు చావకూడదు! వాడివల్ల మనకి ఇంకా పని జరగాలి. వాడ్ని వెంటబెట్టుకుని మిలిటరీ క్యాంప్ జైల్లో ఉంచబడిన అరుణను విడిపించాలి."

"ఈ ప్రమాదంనుంచి తప్పించుకుని మరోదాంట్లో తల దూరుస్తున్నామేమో!"

"దీనికన్నా గూడ ఆపని అతిముఖ్యమయింది. తప్పదు మరి?" అన్నాడు కిరణ్ కుమార్.

పది నిముషాలు గడిచినయ్. ప్యావోని లాక్కెళ్ళి పొదలచాటుకు తీసుకెళ్ళారు. అతడికి తెలివివచ్చి, వాంతి చేసుకున్నాడు.

ప్రేల్చి వేయబడిన వంతెనకు అరమైలు దూరంలో

ఉన్నారు. త్వరలోనే ప్రేలుడు విషయం అందరికీ తెలిసి పోతుంది. అటుజనం ఇటు సైనికులూ వచ్చి తమని చుట్టు ముట్టకముందే వెళ్ళిపోవాలి.

హాంగ్ కాళ్ళూ చేతులూ బంధించి చెట్టుక్రింద కూర్చో బెట్టారు. మేరీ అతడి ప్రక్కనే ఉంది.

ప్యావోని ఎంత అడిగినా బదులు చెప్పటంలేదు.

"వాడిచేత నేను మాట్లాడిస్తాను.ఆపని నాకొదిలెయ్!" అంటూ వాంగ్ ఘూ ముందుకు వచ్చాడు.

ప్యావో దవడలు మారుమ్రోగిపోయేలా కొట్టాడు వాంగ్ ఘూ. ప్యావో నోటంట రక్తం వచ్చింది.

"వీడ్ని చంపేసి మన దోవన మనం పోదాం పద!" అన్నాడు వాంగ్ ఘూ.

ఆమాట వింటూనే ప్యావో చేతులెత్తి దణ్ణం పెట్టాడు. "నాకు అసలే గుండెపోటు. నన్ను అతిగా బాధించకండి. అరుణను మిలిటరీ క్యాంప్ జైల్లో ఉంచాను."

"అయితే పద పోదాం! ఆమెను నేను విడిపించుకు వెళ్ళాలి" కిరణ్ కుమార్ అన్నాడు.

"పులిబోనులో ప్రవేసించిన తర్వాత ఆమెతోగూడ నీవు అక్కడినుంచి తప్పించుకు పోదామనే నీ ఊహ?" ప్యావో కసిగా అన్నాడు.

"నేను అక్కడ్నుంచి బయట పడలేకపోతే నీవు ప్రాణాలతో ఉండవు."

ప్యావో ఒక్క నిముషం ఆలోచించాడు. "సరే పద! పోదాం!"

మేరీ, ఆమె తమ్ముడూ అక్కడే కూర్చున్నారు. వాంగ్ ఘూ వాళ్ళకు కాపలాగా ఉండిపోయాడు.

ప్యావో నీలంరంగు కారులో ప్యావో, కిరణ్ కుమార్లు బయలుదేరారు. ప్యావో కారు నడుపుతున్నాడు. అతడి

ప్రక్కనే అతడి వెన్నులో పిస్తోల్ని గుచ్చిపెట్టి కూర్చున్నాడు కిరణ్ కుమార్.

"లోపలకు పోగానే పిచ్చివేషాలు వెయ్యకు. ఏమైనా పొరబాటు జరిగిందో నీవు ప్రాణాలతో ఉండవు. ఆతరువాత నేనేమైనా నాకు చింతలేదు. మనం నేరుగా అరుణ ఉన్న చోటుకి వెళ్ళాలి. యెవరన్నా నిన్ను ప్రశ్నించినా సరే నీవు ఎక్కువగా మాట్లాడకూడదు. నీ అధికారాన్ని ఉపయోగించి అరుణను, నన్నూ ఇదే కారులో మళ్ళీ బయటకు తీసుకురావాలి. తెలిసిందా?" కిరణ్ కుమార్ ప్యావో నుద్దేశించి అన్నాడు.

"నీకు చైనీస్ భాష బాగా వచ్చునే! నీవు చెప్పిన పథకం బాగానే ఉంది. నేను మొండి ఘటాన్ని. నా ప్రాణాలు అంత తేలికగా పోనిస్తానా? నిన్నూ అరుణను ఎక్కడ వదలమంటే అక్కడే వదిలేస్తాను. కాని ఆ తరువాత నీవు తప్పించుకోగలవా? పైగా వినయ్ సక్సేనాని నాకంటె ముందు నీవు కనుక్కోలేవు!" ప్యావో గర్వంగా అన్నాడు.

"చూద్దాంగా!"

"ఏమిటి చూసేది! నీవు సక్సేనాని వెదికి రక్షించటానికి పంపబడ్డావు. కాని ఇలా మేకీ తమ్ముడ్ని, అరుణనీ రక్షించే ప్రయత్నంలో సక్సేనాని బయట పడేయలేక పోతే, లేదా ఈ విషయం మీ అధికారులకి తెలిస్తే నీపని ఏమవుతుందో తెలుసా?"

"వాళ్ళకి విషయం ఎలా తెలుస్తుంది? అదిగో మిలిటరీ క్యాంప్ గేటు దగ్గరకు వస్తున్నాం; జాగ్రత్త!" అని కిరణ్ కుమార్ హెచ్చరిక చేశాడు.

10

నిజానికది మిలిటరీ క్యాంప్ కాదు. రాజకీయ ఖైదీలను మావో వ్యతిరేకుల్ని ఉంచటానికి ఉద్దేశింపబడిన లేబర్ క్యాంప్ అది. చుట్టూ పదడుగుల ఎత్తున ముళ్ళ తీగలతో (బార్బర్డ్ వైర్) ఫెన్సింగ్ ఉంది.

ప్యావో కారుని గేట్లో వాళ్ళు గుర్తించినట్టున్నారు, గేటుని తెరిచారు. కారు గేటుని దాటేటప్పుడు సెంట్రీ సెల్యూట్ చేశాడు. కారు లోపలకు వెళ్ళంగానే గేటు మూసివేయబడింది.

కారు చిన్న బిల్డింగ్ ముందు ఆగింది. "దిగు! జాగ్రత్త!" అని మరోసారి హెచ్చరించాడు కిరణ్ కుమార్.

ప్యావోని తనకు దగ్గరగా ఉంచుకునే నడిచాడు అతడు. అతడు తన ఓటమికి విచారిస్తున్నట్టున్నాడు, మనిషి డీలాపడిపోయాడు.

ప్యావోని చూస్తూనే కుర్చీలో టేబుల్ ముందు కూర్చున్న యూనిఫారమ్‌లోని వ్యక్తి లేచి నిలబడి సెల్యూట్ చేశాడు.

"ఆ ఇండియా స్త్రీని నాతో తీసుకు వెడుతున్నాను" అన్నాడు ప్యావో.

"రేపు ఇన్స్పెక్టర్ జనరల్ ఆమెతో స్వయంగా మాట్లాడడానికి నిర్ణయించబడింది సార్!"

"ప్రోగ్రామ్ మారింది. ఆమెను రప్పించు!" కర్కశంగా అన్నాడు ప్యావో.

అతడి ప్రక్కనే ఆనుకొని నిలబడి ఉన్న కిరణ్ కుమార్‌ని యెవరూ పట్టించుకోలేదు.

మరో సిపాయి ఆమెను తీసుకురావటానికి లోనికి వెళ్ళాడు. ఆ ప్రదేశమంతా నేరస్థుల ఏడ్పులతో నిండి ఉంది. రక్తం, హింస, చావులు అన్నీ ఇక్కడ విలయ

తాండవం చేస్తున్నదా అన్నట్టుగా ఉంది.

అరుణ రావటం ఆలస్యమయేకొద్దీ కిరణ్ కుమార్ ప్యావోని అనుమానించసాగాడు. లోపలి కెళ్ళిన సిపాయి తనను బంధించే ఏర్పాట్లు చేస్తున్నాడా?

సిపాయి తిరిగివచ్చాడు. అతడి వెనుకనే అరుణ నడిచి వస్తోంది.

మరో కొత్త బెడద వచ్చిపడింది కిరణ్ కుమార్ కి. అరుణ వస్తూనే తనను గుర్తించి పెద్దగా అరిచిందంటే తన గుట్టు బయటపడిపోతుంది. ప్యావోను తను బలవంతం చేసి అరుణను విడిపిస్తున్నాడని అందరకూ అర్థం అయిపోతుంది.

అయితే అరుణ తల ఎత్తకుండా అలాగే నిలబడిపోయింది జైలు వార్డెన్ ముందు.

"ఈమె అన్నం నీళ్లు ముట్టలేదు నిన్నటినుంచి. అప్పుటికే ఒకసారి ఆమెకు బలవంతంగా ఆహారం ఎక్కించాం" అన్నాడు వార్డెన్.

"చాలు! ఇక ఆపు! మిగతా విషయాలు నేను చూసుకుంటాను. మిస్ అరుణా! నేనూ నా అసిస్టెంటూ నిన్ను హాంకాంగ్ లో భద్రంగా దిగవిడుస్తాం. తెలిసిందా?" ప్యావో ప్రతిమాటనీ నొక్కి పెడుతూ పలికాడు.

అరుణ తల ఎత్తి చూసింది. ఎదురుగా కిరణ్ కుమార్ కనుపించాడు ప్యావో ప్రక్కనే. ఆమె ముఖం ఆశ్చర్యంతో తెల్లబడింది. ఆమె ఏవిధమైన ఉద్వేగాన్నీ కనబరచలేదు. అక్కడున్నవారంతా ఆమె ప్యావో వంక భయంగా చూస్తున్నదనే అనుకున్నారు. ఆమె పెదవులు వణికినయ్. కిరణ్ కుమార్ కళ్ళతోనే ఆమెకు సైగ చేశాడు. తనను గుర్తించినట్టు కనబర్చవద్దనీ, జీవితంపై తిరిగి ఆశనూ, స్వేచ్ఛకు బంగారుబాటనీ సూచించాయి అతడి కళ్ళు.

ఆమె నింపాదిగా ఉంది. "మీతో రావటానికి నేను రెడీగా ఉన్నాను."

"రైట్! గుడ్ గర్ల్" అంటూ ప్యావో చిరునవ్వుతో వెనుదిరిగాడు.

ముగ్గురూ వచ్చి కారులో కూర్చున్నారు. ప్యావో ముఖంలో మళ్ళీ కొత్త వెలుగు వస్తోంది. వీళ్ళను ఊరిబయట వదిలేస్తాడు తను. వాళ్ళు తనకు దూరంకాగానే, తన ప్రాణానికి ముప్పు తొలగగానే హెడ్ క్వార్టర్స్‌కి చేరుకుని మిలిటరీని సిద్ధం చేస్తాడు. సైనికులూ, నావికాదళం, ఎయిర్ ఫోర్సు అన్నీ యాక్షన్‌లోకి వెళతాయ్. ఇక కిరణ్ అతడి అనుచరులూ యెలా తప్పించుకోగలరో చూస్తాను అని తనలో తనే నవ్వుకుంటున్నాడు.

ఈ దఫాకూడా ప్యావో స్టీరింగ్ ముందు కూర్చున్నాడు. కారు గేటుదగ్గరకు వచ్చింది. సెంట్రీ గేటుని బార్లా తెరిచాడు. కారు ఆపాడు ప్యావో. కిరణ్ కుమార్ ఉద్వేగంతో, ప్యావో ఏదో కొత్త పన్నాగం పన్నుతున్నాడని భయపడ్డాడు. అయితే ప్యావో సిగరెట్ వెలిగించుకున్నాడు. మళ్ళీ కారుని స్టార్ట్ చేశాడు.

కారు మిలిటరీ క్యాంప్ నుంచి మైలుదూరం పోయిన తర్వాత క్యాంప్‌లో సైరన్ మ్రోగింది.

ప్యావో వెలిగించిన సిగరెట్ రహస్య సంకేతమా? ఆ సైరన్ కారులో పోతున్న కిరణ్ కుమార్ చెవులకి స్పష్టముగా వినబడుతోంది.

పిస్టల్‌ని అతడి డొక్కలోకి గుచ్చి "ప్యావ్, గాపోనీయ్ లేదా నీకు చావు మూడింది" అన్నాడు కిరణ్ కుమార్.

"నాకూ ఆశ్చర్యంగా ఉంది. ఎలా జరిగిందబ్బా ఇలా!" అని విస్తుపోయాడు ప్యావో.

"నీ నక్క వినయాలు నా దగ్గర కాదు. ఏమైనా ఆపద

సంభవిస్తే మనముగ్గురం చనిపోతాం!"

"నిజంగానా? ఎంతకు తెగించావ్!" ప్యావో యాక్సిలేటర్‌ని తొక్కాడు. నిర్మానుష్యంగా ఉన్న రోడ్డుమీద కారు అతివేగంగా పరుగెడుతోంది.

అరగంట ప్రయాణం చేశాక 'యు' టర్నింగ్‌లో ప్యాసెంజర్ బస్సు యెదురయింది. ప్యావో కారుని స్లో చేయబోయాడు కాని కిరణ్‌కుమార్ అడ్డుచెప్పాడు. కారు అడ్డుగా ఉంది. ప్యావో భయంతో నోరు తెరిచాడు. బహుశా అతడు డ్రైవింగ్‌లో నేర్పరి కాడేమో అనుకున్నాడు కిరణ్‌కుమార్.

కారు ప్రక్కగా దూసుకుపోతూ బస్సుని తప్పుకోవడంలో సగం కారు రోడ్డు క్రిందకు దిగి రాళ్ళగుట్టలమీద ఎక్కింది. కిరణ్‌కుమార్ తన రెండో చేత్తో స్టీరింగ్ వీల్‌ని పట్టుకుని కంట్రోల్ చేయకపోతే కారు తలక్రిందులయేదే!

ప్యావో స్పృహ తప్పిపోతున్నవాడిలా డోర్ మీదకు ఒరిగిపోయాడు.

"అతడు పడిపోయాడు. హార్ట్ ఎటాక్ వచ్చిందేమో!" అరుణ అంది.

అతడ్ని ప్రక్కకు నెట్టి స్టీరింగ్ పుచ్చుకుని యాక్సిలేటర్ మీద కాలు వేశాడు కిరణ్‌కుమార్.

బస్సులోనుంచి కోపంగా అరుస్తున్న కేకలు లీలగా వినబడుతున్నయ్. బహుశా తమ రాష్ డ్రయివింగ్ గురించే అయివుంటుందనుకున్నాడు కిరణ్‌కుమార్.

కారు నాలుగైదు మైళ్లు ప్రయాణించింది.

"అరుణా! నీకు డ్రయివింగ్ వచ్చుకదూ?" కిరణ్ కుమార్ అరుణని అడిగాడు.

"వచ్చు! ఏం?"

కారు ఆపాడు. డోర్ తెరచి 'కోమా'లో వున్న ప్యావోని క్రిందికి లాగి చెట్లనీడలో పరుండబెట్టాడు.

కారు రివర్స్ చేశాడు. "ఇక పోనీయ్!" అన్నాడు కిరణ్ కుమార్ వెనుక సీట్ లో పడుకుంటూ.

"బాబోయ్! మళ్ళీ వెనక్కా?" అంది అరుణ.

"నీకేం భయంలేదు. నేనున్నాను. పోనీయ్!" అన్నాడు.

అరుణ కారు వేగాన్ని హెచ్చించింది.

ఇంతకుముందు తాము డాష్ ఇవ్వబోయిన బస్ అక్కడే ఉంది. దాని ప్రక్కన మిలిటరీ ట్రక్కు వుంది. చిన్నగుంపు వాళ్ళచుట్టూ చేరారు.

అరుణ తలకు నాప్ కిన్ కట్టుకుని వున్నది. కళ్ళకు గాగుల్స్ పెట్టుకుంది. ఆమెని చూస్తే ఇంతకుమునుపే జైలునించి విడుదలయిన స్త్రీ అని ఎవరూ ఊహించలేరు. ఏవిధమైన తొట్రుపాటు లేకుండా కారుని జనంప్రక్కగా పోనిచ్చింది.

జనంలో ఎవరూ ఆ కారుగురించి పట్టించుకోలేదు! ఎందుకంటే ఆకారు ఆగంతకులు పారిపోయిన దిక్కునుంచే వస్తున్నందున.

"నీ ప్లాన్ అమోఘంగా పనిచేసింది. ఇక ఎటు వెళ్ళాలి. ఎడమవైపు రోడ్డు మిలిటరీ క్యాంప్ కి దారితీస్తుంది."

"అయితే కుడివైపుగా పోనీయ్."

కారు ఏ ఆటంకమూ లేకుండా వూరు దాటింది. అరుణ అన్నది మళ్లీ, "కిరణ్! కారు నీవు నడుపుదూ! తిండిలేక నాకు నీరసంగావుంది. నిద్రలేమిచే కళ్ళముందు మచ్చలు ఏర్పడుతున్నయ్."

"అలాగే!" అంటూ డ్రైవింగ్ సీట్లోకి మారాడు కిరణ్ కుమార్.

అతడి భుజంపై తన తలవాల్చి కూర్చుంది అరుణ.

"మరీ నీరసంగావుందా అరూ?"

"లేదులే! కాని నేను కలగంటున్నానేమో అని భ్రమ కలుగుతోంది. నా జీవితం ఆ కిరాతకుల చేతిలో అంతమయిందనే అనుకున్నాను. నాకోసం నీ ప్రాణాలకు తెగించి వస్తావని అనుకోలేదు కరణ్!"

"నీవు నా ప్రాణానికన్న అధికమైన విలువగలదానివి. అందుకే నీకోసం రాక తప్పలేదు."

"ఇక భయంలేదు!" అంది అరుణ.

"అప్పుడే సుఖాంతం చెయ్యకు. మనముందు అతి ప్రమాదభరితమయిన క్షణాలు కాచుకుని ఉన్నాయ్!"

"నీ ప్రక్కన ఉంటే ఎన్ని ప్రమాదాలయినా ఇట్టే దాటేయగలను. నీవు యింతటి సాహసవంతుడివని అనుకోలేదు!" అరుణ ప్రేమగా అంది.

11

కల్నల్ ప్యావో కళ్లు తెరిచాడు. ఎదురుగా డాక్టర్లూ నర్సులూ, ఆక్సిజన్ సిలెండర్ కనబడ్డాయి.

"సార్జెంట్ ఎక్కడ?" అని అరిచాడు ప్యావో.

"కర్నల్ సార్! మీరు గుండెపోటునుంచి కోలుకున్నారు. మీరు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి!" అని వారించాడు డాక్టర్.

"విశ్రాంతి! వాళ్ళను ప్రాణాలతో పట్టుకునేదాకా నాకు విశ్రాంతిలేదు."

సార్జంట్ వచ్చి అతడిముందు నిలిచాడు.

"బ్రిడ్జిని పేల్చింది ఎవరో కనుక్కొని పట్టుకురా! వాళ్ళను నా కళ్లెదుటే చిత్రాతిచిత్రంగా హింసించాలి!" అన్నాడు ప్యావో.

"వాళ్ళు ఎక్కడో దాక్కొని ఉంటారు సార్! క్షణాల మీద ఎలా దొరుకుతారు?" సార్జెంట్ వినయంగా అన్నాడు.

"వెళ్ళి వెతుకు! ఎలాగైనా వాళ్ళను దొరకపుచ్చుకుని రా!" గర్జించాడు ప్యావో.

ఒక గంట గడిచాక పదహారేళ్ళ యువకుడ్ని తెచ్చారు సైనికులు. అతడి నోటంట రక్తం వస్తోంది. ముందు పళ్ళు రెండు ఊడిపోయాయి. ఒక కన్ను వాచి మూసుకు పోయింది.

"ఒరేయ్! నీనుంచి రెండే రెండు ముక్కలు వినాలి మేం! ఆ వంతెనను కూల్చివేయుమన్న దెవరు?"

ఆ కుర్రవాడు ప్యావోవంక చూసి నేలమీద తుప్పుక్కున ఉమ్మేశాడు.

"సార్జెంట్! వీడ్ని ఆ ఆపరేషన్ టేబుల్ మీద పడేసి కత్తికోకండా పీకండి!"

నలుగురు బలిష్ఠమైన సైనికులు అతడ్ని కాళ్ళూ చేతులూ పట్టుకుని టేబుల్ మీద పడుకో బెట్టి బలంగా అదిమి పట్టుకున్నారు.

మరో సైనికుడు సర్జికల్ బ్లేడ్ను తెచ్చి టేబుల్ దగ్గరగా ఉంచాడు.

ఒక కత్తితీసి సార్జెంట్ అతడి పొట్టమీద ఆనించాడు, చొక్కా తొలగించి.

"బాబోయ్! చెబుతాను!" అని అరిచాడు యువకుడు.

"చెప్పు మరి!"

"అతడి దే ఊరో నాకూ తెలీదు. 'సీ డ్రాగన్' అనే స్టీమర్లో అతడు పైలట్!"

"వాడి పేరు?"

"వాంగ్-ఛూ!"

"సరే! వీడ్ని లాకప్‌లో ఉంచండి. సాక్ష్యానికి పనికి వస్తాడు" అన్నాడు ప్యావో.

12

"నీ కుటుంబ పూర్వచరిత్ర చదివాను. నీ అన్న దేశానికి ద్రోహం తలపెట్టి కాల్చివేయబడ్డాడు. మీరూ అతడి అడుగుజాడల్లోనే నడవాలని చూస్తున్నారు. మిమ్మల్ని బ్రతికి ఉండనిచ్చినందుకు యిదేనా మీరు దేశానికి చేసే గౌరవం!" ప్యావో అరుస్తున్నాడు.

ప్యావో యింత త్వరగా తన ఆటకట్టిస్తాడనుకోలేదు. ఆ ఎగువెధవ వాంగ్ ఛూ ఎక్కడ తారాడుతున్నాడో. అంతా మించిపోయాక వచ్చి వీళ్ళ చక్రబంధంలో పట్టుబడిపోయి, అన్నలాగే కాల్చి చంపబడటానికి వస్తాడు కాబోలు అనుకుంది లీన్‌షూ.

"మాట్లాడవేం?" ప్యావో గద్దించాడు.

"నేను చెప్ప గలిగింది ఏమీ లేదు" తలవంచుకుని చెప్పింది లీన్‌షూ.

"ఇన్‌స్పెక్టర్! జరిగినదంతా ఈమె నోటివెంట నేను వినాలి. ఈమెచేత పలికించు!" ప్యావో ఛుంగ్‌లీ వైపు తిరిగి అన్నాడు.

"సార్! ఈమె నాకు మొదటినుంచీ బాగా తెలుసు" అతడిమాట పూర్తికాకుండానే ప్యావో అరిచాడు.

"అందుకే నీవు ఆమెమీద చెయ్యివేయటానికి వెనుకాడుతున్నావనీ తెలుసు! ఆ పని నీవు చేస్తావా, మరొకర్ని పిలవనా?"

ఇన్‌స్పెక్టర్ ఛుంగ్‌లీ తమాయించుకోలేకపోయాడు. లీన్‌షూ చేసిన తప్పిదానికి తాను సంజాయిషీ చెప్పకుని దోషిలా నిలబడవలసి వచ్చింది. అతడిలో రాక్షసత్వం పెల్లుబికింది.

"లీన్ మాట్లాడు!" అని అరిచాడు.

ప్యావో ముఖాన చిరునవ్వు వెలిసింది.

ఛుంగ్ లీ తన నడుముకున్న బెల్టు విప్పాడు. బెల్టు ఆమె శరీరంపై ఛడేల్ ఛడేల్ మని విలయతాండవం చేసింది.

"ఊఁ! ఇంకా! ఇంకా!" ప్యావో అరుస్తున్నాడు.

లీన్ షూ కుర్చీలోంచి క్రిందపడిపోయింది. ఆమె శరీరం నుంచి రక్తం కారుతోంది. ఒంటిమీద వాతలు తేలినయ్.

ఇన్ స్పెక్టర్ ఛుంగ్ లీ అలిసిపోయాడు ఆమెను కొట్టీ, హింసించీ. కాని ఆమెనుంచి ఒక్క మాట గూడ రాలేదు.

ప్యావో అక్కడే కుర్చీ వేసుకుని కూర్చున్నాడు.

"సార్! ఏదైనా డ్రింక్ తెస్తాను!" అన్నాడు ఛుంగ్ లీ, కాస్సేపన్నా విశ్రాంతి చిక్కుతుందని.

"త్వరగా రా! ఈ లోపల నీ ప్రియురాలుగూడ కొంచెం తేరుకుంటుంది" అన్నాడు ప్యావో ఓ విషపు నవ్వు నవ్వుతూ.

వెనుక గుమ్మంనుంచి వెలుపలికి వచ్చాడు ఇన్ స్పెక్టర్. ఆలోచిస్తూ బయటకు అడుగు వేసిన అతడి కంఠంచుట్టూ ఎవరిదో చేయి బిగుసుకుంది. రెండో చేతిలోకి తళతళలాడే కత్తి అతడి కళ్ళముందే కంఠానికి ఆనుకుంది. గొంతుకి గుచ్చుకుని కొద్దిగా చర్మం పైకిలేచింది.

"కత్తి ఇంకా లోతుగా దిగకుండా ఉండాలంటే మేం అడిగింది వెంటనే చెప్పు! లీన్ షూ ఎక్కడ?" వాంగ్-ఛూ అడిగాడు నెమ్మదిగా.

"ప్యావో ఎక్కడ?" మరో కంఠంగూడ వినిపించింది.

పోలీస్ స్టేషన్ ప్రక్కగా బ్రిడ్జి ఉంది. ఇన్ స్పెక్టర్ ని దాని క్రిందకు లాక్కెళ్ళారు.

"వాళ్ళిద్దరూ స్టేషన్ లోనే ఉన్నారు" అన్నాడు ఇన్ స్పెక్టర్.

"ఆమెను చిత్రహింసలు పెడుతున్నావ్ కదూ?" అప్పటికిగాని అతడి ముఖం చూడలేదు ఇన్‌స్పెక్టర్.

"వాంగ్-ఛూ! ఎలా వచ్చావ్!"

"అడిగిందానికి సమాధానం చెప్పి ఏడువ్!"

"నేనేం చేయను. నా కివ్వబడ్డ ఆదేశం అలా ఉంది."

"పాపం! నువ్వు అమాయకుడివి. 'నాజీ'ల కన్న ఘోరంగా మీరు హింసిస్తారు, దారుణంగా చంపుతారు, ద్యూటీ పేరుతో!"

"లేదు! ఆమెకు సాయంచేయాలనే ఉంది. కానీ?"

"లోపల ఎంతమంది ఉన్నారు?"

"ఆరుగురు! పదండి! నేను మీతో సహకరిస్తాను!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఏం? చావంటే భయపడి ఈ పని చేస్తున్నావా?"

ఇన్‌స్పెక్టర్ని అక్కడే ఉంచాడు కిరణ్‌కుమార్. అతడి వెన్నులో పిస్టల్ ఆనుకుని ఉంది.

వాంగ్-ఛూ లోపలకు వెళ్ళాడు పిల్లిలా. అతడిచేతిలో సైలెన్సర్ ఉంది.

ప్యావో కుర్చీలో కూర్చుని విలాసంగా సిగరెట్ త్రాగుతున్నాడు.

సైలెన్సర్ టిక్‌మంది. ప్యావో నేలవాలాడు చడీ చప్పుడు లేకుండా.

మిగతా ఆరుగురు పోలీసుల్నీ సఫాచేశాడు వాంగ్-ఛూ. తన అన్నను కాల్చి చంపిన పోలీసులంటే అతడికి చెప్పలేనంత కోపం. ఆ పగ ఇప్పటికి తీర్చుకున్నాను అనుకున్నాడు.

వాంగ్-ఛూ తన చెల్లెల్ని సమీపించాడు.

"వచ్చావా? నిజంగా నువ్వేనా?"

"పరిస్థితి చేయి దాటిపోయాక వచ్చానా?"

"లేదు. ఇంకా అదుపు తప్పలేదు. కాని మన ఇంటి చుట్టూ పోలీసు కాపలా ఉంది."

"ఫరవాలేదు పద!" అంటూ ఆమెకు చేయూత నిచ్చాడు వాంగ్-ఛూ. ఆమె అతడి భుజంపై తలవాల్చి, కన్నీరు కార్చింది.

"ఈ ఇన్‌స్పెక్టర్ని గూడ పీడా వదిలించుకుంటే పోలా!" కిరణ్‌కుమార్ అన్నాడు.

"వద్దు! మా ఇంటిచుట్టూ కాపలా ఉంది. ఇతడు మనతో ఉండటం ఎంతైనా అవసరం!"

"అయితే కదలండి త్వరగా!"

కారులో కూర్చున్నారు అందరూ. కారు కదిలింది.

"లైట్లు ఆర్పేయ్!" అన్నాడు వాంగ్-ఛూ.

"దోవ కనిపించదే! ఎలా?" అన్నాడు కిరణ్‌కుమార్.

"నేను కాపన్ ఇస్తాను!"

లైట్లు ఆర్పేశాడు. వాంగ్-ఛూ చీకట్లోకి చూస్తూ దోవ చెబుతున్నాడు.

ఎత్తుగా గుట్టచాటునుంచి ఎవరో గార్డు అరిచాడు "ఎవరా వచ్చేది?" అని.

వాంగ్ ఛూ ఇన్‌స్పెక్టర్ ఛుంగ్‌సీని డొక్కలో పొడిచాడు.

"నేనేలే! ఇన్‌స్పెక్టర్ని. చెక్ చేయటానికి పోతు న్నాను. నీ 'పోస్ట్'లోనే జాగ్రత్తగా ఉండు" ఇన్‌స్పెక్టర్ తిరిగి అరిచాడు.

గార్డు వెనక్కు వెళ్ళిపోయాడు.

వాంగ్ ఛూ కారు దిగి అందరికీ మెషీన్ గన్స్‌ని పంచి పెట్టాడు, మేరీ, అరుణ, లీన్‌హువాలకు.

వాంగ్ ఛూ ఇంట్లోకి పరుగెత్తాడు.

వాకిట్లోనే వినయ్ సక్సేనా ఎదురయ్యాడు. అతడిచేతిలో

మూట ఉంది. అతడ్ని కారులో సర్దాడు కిరణ్ కుమార్.

"మీరు ఎలా తప్పించుకోగలరు?" ఛుంగ్ లీ అడిగాడు.

"ఎలాగోలాగు సముద్రం దాకా చేరితే అక్కడ్నుంచి ఏదో ఒక స్టీమర్లో ఎక్కి తప్పించుకుంటాం" వాంగ్ ఛూ సమాధానం చెప్పాడు.

"అవసరస్క. ఈ దగ్గర్లోనే ఎయిరోడ్రోమ్‌లో ప్యావో ఎక్కి వచ్చిన మిలిటరీ ప్లేన్ ఉంది. మిమ్మల్ని అందులో ఎక్కించగలను! నన్ను నమ్మండి!"

"నీవు మాకు శత్రువువి గదా! మాకు సహాయం చేస్తున్నావేమిటి?" వాంగ్ ఛూ ఆశ్చర్యంగా అడిగాడు.

"కాని లీన్ షూకు నేను చేసిన అమానుషకృత్యానికి ఇది ప్రాయశ్చిత్తం! అంతే!" అంటూ తన అనుచరులకు విజిల్ వేశాడు ఇన్‌స్పెక్టర్. వాళ్ళంతా ఇంటిలోకి రాగానే పోలీసుల్ని అందర్నీ మెషీన్ గన్‌తో కాల్చేశాడు వాంగ్ ఛూ.

లీన్ షూ తల్లినిగూడ రమ్మన్నారు తనతో. తండ్రి క్రితం రోజే లీన్ షూని అరెస్ట్ చేశారని తెలియగానే గుండె పోటుతో మరణించాడు.

"నా భర్త, నా కొడుకు ఇక్కడే చనిపోయారు! నా ప్రాణంగూడ ఇక్కడే పోవాలి. నేను రాను!" అంది ఆమె.

"వాళ్ళు నిన్ను బ్రతకనిస్తారా? నానాహింసలు పెడతారు!"

"నన్ను నేను రక్షించుకోగలను! నా కేదన్నా ఆయుధం ఇవ్వండి ఆత్మరక్షణకు!"

ఆమె చేతికి రివాల్వర్‌ని ఇచ్చారు.

కారు బయలుదేరి పదిగజాలు పోయిందో లేదో, ఆ

ఇంట్లో రివాల్వర్ ప్రేలిన చప్పుడు వినిపించింది.

"ఏమిటది?" లీన్‌షూ అదిరిపడింది.

"మీ అమ్మ ఆత్మహత్య చేసుకుంది!" అన్నాడు కిరణ్ కుమార్.

*　　　*　　　*

కారు ఎయిర్‌డ్రోమ్ చేరింది.

అదో మిలిటరీ విమానాశ్రయం కావటం మూలాన ఇద్దరు ముగ్గురు సెంట్రీలకన్న లేరు. లాంజ్‌లో కూర్చుని పైలట్ సీసాలు ఖాళీ చేస్తున్నాడు.

కారులోంచి ముందుగా ఇన్‌స్పెక్టర్ ఛుంగ్‌లీ దిగాడు. అతడి చేతిలో మిషన్‌గన్ ఉంది.

బంధితుడ్ని తీసుకువెళ్ళేవాడిలా గన్ చూపిస్తూ వాళ్ళని లోపలకు తీసుకువెళ్ళాడు.

"వీళ్ళని మిలిటరీ హెడ్‌క్వార్టర్స్‌కి తీసుకువెడుతున్నాం. ప్యావో వెనుక కారులో వస్తున్నాడు" అన్నాడు అక్కడున్న వాళ్ళను చూసి.

ప్యావో పేరు వింటూనే అందరూ ఎటెన్షన్‌లో నిలబడ్డారు. "ఈ లోపల వీళ్ళను విమానంలో కూర్చోబెడతాను" అన్నాడు ఛుంగ్‌లీ.

పైలట్ సరేనన్నట్లు తల ఊపాడు.

వినయ్ సక్సేనా తన మూటను భుజానికెత్తుకున్నాడు. ఆయుధాలున్న మరో మూటను కిరణ్‌కుమార్ మోస్తున్నాడు.

అందరూ విమానంలో ఎక్కారు.

"నీవుకూడా రా ఛుంగ్‌లీ!" అన్నాడు కిరణ్‌కుమార్.

"నేను రాను!"

"ఇక్కడ ఉంటే నీ పరిస్థితి ఎంత విషమిస్తుందో తెలుసా?"

"తెలుసు! అయినా రాను. మీరు బయలుదేరండి. ఆలసించినకొద్దీ ప్రమాదం!" అని హెచ్చరించాడు.

కిరణ్ కుమార్ డోర్ వేసేశాడు. పైలట్ సీట్లో కూర్చుని ఇంజన్ స్టార్ట్ చేశాడు.

నేలమీద ఉన్న ఇన్ స్పెక్టర్ చేతిలో గన్ వరుసగా పేలింది. వాంగ్ ఘూ కిటికీలోంచి క్రిందకు చూశాడు.

అక్కడున్న సెంట్రీలు, పైలట్, ఇన్ స్పెక్టర్ ఘుంగ్ లీ నేలమీద రక్తపు మడుగులోపడి ఉన్నారు.

విమానం వేగాన్ని పుంజుకుంది. చైనా భూభాగం దాటి బర్మాలో ప్రవేశించింది.

వైర్ లెస్ లో హాంగ్ కాంగ్ లో తమ శాఖని కాంటాక్ట్ చేసి తాము నేరుగా కలకత్తా వెళ్తున్నట్టు చెప్పాడు కిరణ్ కుమార్.

బర్మాదాటి బంగళాదేశ్ మీదుగా ఎగురుతోంది ప్లేన్.

కాక్ పిట్ లోకి వినయ్ సక్సేనా వచ్చాడు.

'ఏం?' అన్నట్టుగా చూశాడు కిరణ్.

"నాకో సాయం చేయాలి!"

"ఏమిటి?"

"మేరీని వాంగ్ ఘూ వివాహం చేసుకోబోతున్నాడు. నా కోసం త్యాగంచేసిన లీన్ షూని నేను వివాహమాడాలని నిర్ణయించుకున్నాను" వినయ్ సక్సేనా గొణిగాడు.

"విదేశీ వనితను పెళ్ళాడేందుకు ప్రభుత్వం అనుమతిస్తుందో లేదో అని అనుమానమా?"

"ఆ విషయం నేను చూసుకోగలను! కాని అరుణకు ఈ విషయం ఎలా చెప్పాలా అని!"

"అదా! ఆ విషయం నాకొదిలెయ్! నువ్వు నిశ్చయంగా ఉండు!"

"థాంక్యూ!" అంటూ వెనక్కు వెళ్ళి తన సీటులో

కూర్చున్నాడు వినయ్ సక్సేనా. ప్రక్క సీటులో కూర్చున్న లీన్ షా చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

అరుణ సిగ్గుతో లేచింది. కాక్ పిట్ లోకి నడిచింది.

"రా అరుణా! డమ్ డమ్ విమానాశ్రయంలోకి దిగబోతున్నాం!" అన్నాడు కిరణ్ కుమార్.

దూరంనుంచి విమానాశ్రయం అంతా జనంతో కిక్కిరిసి పోతున్నది. ప్రెసిడెంటు, ప్రధాన మంత్రి ఇంకా అనేక మంది ప్రముఖులు వాళ్ళకు స్వాగతం చెప్పటానికి రెడీగా ఉన్నారు.

"నీకు ఘనంగా సన్మానం జరగబోతోంది కిరణ్!" అన్నది అరుణ.

"ఈ ట్రిప్ లో నా బహుమతిని ఎప్పుడో గెల్చుకున్నాను."

అరుణ ఆశ్చర్యంగా చూసింది. "ఏమిటో నాకు చెప్పనే లేదు కదూ?"

"నా అరుణను నేను గెల్చుకున్నాను" అన్నాడు కిరణ్ కుమార్.

అరుణ కిలకిలా నవ్వింది.

స్వాగతం చెబుతూ విమానాశ్రయంలో ఫిరంగులు మ్రోగినయ్.

—: ఐ పో యిం ది :—